తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
04-10-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 236
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## ప్రజాబాటలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



- వారానికి రెండు రోజులు బస్తీలు, గ్రామాల్లో విద్యుత్ సేవలు
- వినియోగదారులకు చేరువవుతున్న 'ప్రజాబాట - బస్తీబాట'
- క్షేత్రస్థాయిలోనే ఫిర్యాదుల స్వీకరణ, తక్షణ పరిష్కారమే లక్ష్యం
- గత ఆరు నెలల్లో 73,457కు పైగా సమస్యలకు పరిష్కారం
- ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడమే ధ్యేయం
- సీఎండీ జితేష్ వి. పాటిల్

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**

విద్యుత్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారం అందించే లక్ష్యంతో చేపట్టిన ప్రజాబాట బస్తీబాట కార్యక్రమం అద్భుతమైన ఫలితాలను సాధిస్తోంది.

మిగతా 2వ పేజీలో..



# వేడి పెరుగుతోంది!

## రాష్ట్రవ్యాప్తంగా భానుడి ప్రతాపం

- ఉక్కపోతతో అమాంతం పెరిగిన కరెంట్ వినియోగం
- సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 2 వరకు జీహెచ్ఎంసీలో భారీ వినియోగం
- గత మూడేళ్లతో పోలిస్తే 2026లో సరికొత్త గరిష్ఠాలు
- అక్టోబర్ 1న జీహెచ్ఎంసీ పరిధిలో ఆల్‌టైమ్ రికార్డు
- 4,114 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదు
- టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో సెప్టెంబర్ 30న చరిత్రలోనే తొలిసారిగా 12,299 మెగావాట్లకు చేరిక
- రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 30న ఆల్‌టైమ్ రికార్డు స్థాయి 19,892 మెగావాట్ల గరిష్ట డిమాండ్
- ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు..
- ఎయిర్ కండీషనర్ల విచ్చలవిడి వాడకమే కారణం

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్**

తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న ఎండ తీవ్రత, విపరీతమైన ఉక్కపోత కారణంగా విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. వర్షాకాలం ముగింపు దశలోనూ ఎండలు దంచి కొడుతుండటంతో గృహ, వాణిజ్య అవసరాలతో పాటు వ్యవసాయ రంగంలోనూ కరెంట్ వినియోగం భారీగా పెరిగింది. రానున్న నెల రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో విద్యుత్ సంస్థలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 2 వరకు వారం రోజుల వ్యవధిలోనే నమోదైన డిమాండ్ విద్యుత్ అధికారులను సైతం విస్మయానికి గురిచేస్తోంది. నగర విస్తరణ, ఐటీ కారిడార్లలో డేటా సెంటర్ల ఏర్పాటు, కొత్త కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ఇళ్లలో ఏసీలు, కూలింగ్ పరికరాల వాడకం అమాంతం పెరిగిపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

మిగతా 2వ పేజీలో..

## పిల్లల ఆన్‌లైన్ భద్రతకు సమగ్ర చైల్డ్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎన్ఎఎల్ఎస్ఏ దక్షిణ మండల ప్రాంతీయ సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభం
- ఉచిత న్యాయ సేవల కోసం సంచార లోక్ అదాలత్ వాహనాలు ప్రారంభం
- సైబర్ హెల్ప్‌లైన్ '1930', చైల్డ్ హెల్ప్‌లైన్ '1098' పై అవగాహన పెంచాలి

2



## అనంతగిరి ఘాట్ రోడ్డులో బస్సు బోల్తా

- అయిదుగురి మృతి, 12మందికి గాయాలు

**వికారాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 3 :**



వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ ఘాట్‌రోడ్డులో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు శనివారం ఉదయం అదుపు తప్పి పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు మృతిచెందగా 12 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో

మిగతా 2వ పేజీలో..



## ఉపాధి లక్ష్యమే ఉన్నత విద్య పరమార్థం కావాలి

- మంత్రి శ్రీధర్‌బాబు
- స్టార్టప్‌లు, ఆవిష్కరణల కోసం ఇంక్యుబేషన్ సెంటర్
- డిగ్రీతో పాటే నైపుణ్యాల సాధన నూతన ప్రమాణం కావాలి
- జేఎన్‌టీయూహెచ్‌లో వేడుకగా 'రీచ్-2026' సదస్సు

2

## కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

- మెట్రో, బస్సులో ప్రయాణించిన డిప్యూటీ సీఎం భట్టి
- ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం
- మెట్రో-ఆర్టీసీ అనుసంధానానికి శ్రీకారం
- ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి

**హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 3 :**

హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మెట్రో రైలు, ఆర్టీసీ బస్సు సేవలను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన ఆర్టీసీమెట్రో కామన్ పాస్ ద్వారా ప్రయాణికులకు ఒకే పాస్‌తో మరింత సులభంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం కల్పించింది. ఈ సౌకర్యం అమలు తీరును స్వయంగా పరిశీలించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మెట్రో

మిగతా 2వ పేజీలో..





## 10 నుండి 18 వరకు బతుకమ్మ వేడుకలు

- ఏర్పాట్లపై సీఎస్ సంజయ జాజు సమీక్ష

2

## యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలే శ్రేయస్కరం

- వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల
- తక్కువ నీటితో పండే పప్పు ధాన్యాలు, నూనె గింజల వైపు మళ్లాలి
- 'రైతు నేస్తం' 109వ ఎపిసోడ్‌లో రబీ విత్తన పంపిణీ ప్రారంభం
- 50% నుంచి 100% సబ్సిడీపై విత్తనాలు



3



## ఆటో కార్మికుల సంక్షేమానికి త్వరలో బోర్డు

- మానవీయ కోణంలో సమస్యల పరిష్కారం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రజా భవన్‌లో ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులకు ఆత్మీయ విందు
- హాజరైన మంత్రులు పొన్నం, అడ్లూరి

3

## 22-ఎ పరిష్కారంలో మరో కీలక అడుగు

- నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల రిజిస్ట్రేషన్లు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, సిరి న్యూస్ అక్టోబర్ 3 :**

నాలా అనుమతి లేకుండా నివాస వినియోగంలోకి వచ్చిన పట్టా భూముల వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. నాలా రుసుము చెల్లింపుతో అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం అయింది. దీనిపై జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ అయ్యాయి. మెమో

మిగతా 3వ పేజీలో..



## బ్యాలెట్‌తో ఎన్నికల్లోకి వెళ్లేందుకు సిద్ధమా?

- కాంగ్రెస్ సీఎంలారా.. రాజీనామా చేసి రండి
- జ్ఞానేశ్ కుమార్‌కు, బీజేపీకి ఏం సంబంధం?
- అనివార్య కారణాల వల్ల అమిత్ షా టూర్ వాయిదా
- కేంద్ర మంత్రి బండి సంజయ్

3

# విద్య, వైద్యంపై సీఎం ఫోకస్

**హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 3 :** రాష్ట్రంలో విద్య, వైద్యానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సీఎంవో అధికారులతో సీఎం శనివారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రధాన హాస్పిటల్స్ నిర్మాణాలు, పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా హాస్పిటల్స్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను మొదలు పెట్టాలని, హాస్పిటల్స్ నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. అవసరమైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేసి, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతోపాటు అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, హాస్పిటల్స్‌ను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. సంబంధిత జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రతీ వారం వీటిపై సమీక్ష నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైనచోట మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 ఏర్పాట్లపైనా సమావేశంలో అధికారులతో చర్చించారు. సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి లక్ష్యమే ఉన్నత
# విద్య పరమార్థం కావాలి

**హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 3 :** తరగతి గదికి, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విద్యా సంస్థలకు పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థ యువతలో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాక వారిలో నైపుణ్యాలను అందించేలా వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపేలా సిద్ధం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టీజీసీహెచ్‌ఈ) ఆధ్వర్యంలో కూకట్‌పల్లి జేఎన్‌టీయూహెచ్‌లో శనివారం నిర్వహించిన 'రీచ్2026' (రిసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ అడ్వాన్స్‌మెంట్) సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

తరగతి గది నుంచి భవిష్యత్ కెరీర్ వైపు, విద్య నుంచి నైపుణ్యాల వైపు, పరిశోధన నుంచి పారిశ్రామిక రంగానికి నిరంతర అనుసంధానం ఉండాలని మంత్రి పేర్కొన్నారు. మన విద్యా వ్యవస్థ కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు అందించే విధానం నుంచి విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించే దిశగా మారాలన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థి ఉద్యోగానికి అర్హత సాధించాలని, పట్టా చేతికి వచ్చే సమయానికే ఆ స్థాయి సన్నద్ధత ఉండాలని పునరుద్ఘాటించారు. విద్యార్థులు, పరిశోధకులు తమ ఆలోచనలను స్టార్టప్‌లుగా, నూతన ఉత్పత్తులుగా మలచడానికి వీలుగా ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కరికులమ్ రూపకల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్ట్‌లు, పరిశోధనల్లో పరిశ్రమలు భాగస్వామ్యమవ్వాలని విజ్ఞప్తి చేశారు. 'ఒక చేతిలో డిగ్రీ.. మరో చేతిలో నైపుణ్యం' ఉండటమే మన నూతన ప్రామాణికం కావాలన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో 65 ప్రభుత్వ ఐటీఐలను రోబోటిక్స్, ఆటోమేషన్, ఇండస్ట్రీ 4.0 వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాలుగా (ఏటీసీ) తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా సరికొత్త విద్యా, నైపుణ్య వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. 'తెలంగాణ రైజింగ్2047' లక్ష్యంతో ఉన్నత విద్యను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దడం, పరిశోధనల్లో ప్రతిభను పెంచడం, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడంపై సదస్సులో విస్తృతంగా చర్చించారు. సదస్సులో సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, టీజీసీహెచఈ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, ఉస్మానియా వర్సిటీ వీసీ¾ ప్రొఫెసర్ ఎం.కుమార్, ప్రొఫెసర్ పురుషోత్తంలతోపాటు వివిధ వర్సిటీల ఉపకులపతులు, 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## 10 నుండి 18 వరకు
# బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 3:** తెలంగాణ సంస్కృతికి ప్రత్యేకత ఉన్న బతుకమ్మ పూల పండగను ఈనెల 10 నుండి 18వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. 18వ తేదీన సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని ట్యాంక్ బండ్‌పై వేలాదిమంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాదిమంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్‌పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాదిమంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాక పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుద్దీపాలతో అలంకరించాలని, నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుద్దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచఎండీఏ, జీహెచఎంసీ అధికారులను సీఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్‌పై బతుకమ్మ ఉత్సవాలు జరగనున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. బతుకమ్మ జరిగే పది రోజులపాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్‌లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను కూడా ఈ లోగోలో తెలియచేసేలా రూపొందించనున్నట్టు తెలిపారు. సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణిప్రసాద్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య, జీహెచఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మల్కాజిగిరి సీపీ బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) హైదరాబాద్ జోయెల్ డేవిస్, స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ముకుంద రెడ్డి, హార్టీకల్చర్ కమిషనర్ షేక్ యాస్మీన్ బాషా, జల మండలి కమిషనర్ అశోక్ రెడ్డి, టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, శిల్పారామం, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ.నర్సింహారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వేడి పెరుగుతోంది!

**గత మూడేళ్ల రికార్డులు బద్దలు..**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే 2026 నాటి విద్యుత్ వినియోగం ఊహకందని రీతిలో పెరిగింది. సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 2 మధ్య నమోదైన గరిష్ట డిమాండ్‌ను విశ్లేషిస్తే.. 2023 గరిష్ట డిమాండ్ 2,647 మెగావాట్ల నుంచి 3,043 మెగావాట్ల మధ్య నమోదైంది. 2024 డిమాండ్ మరింత పెరిగి 2,999 నుంచి 3,417 మెగావాట్ల మధ్య కొనసాగింది. 2025లో 2,682 నుంచి 3,281 మెగావాట్ల స్థాయిలో గరిష్ట డిమాండ్ నమోదైంది. 2026లో ఏకంగా 3,601 మెగావాట్ల నుంచి 4,114 మెగావాట్ల అసాధారణ స్థాయికి ఎగబాకింది. ముఖ్యంగా అక్టోబర్ 1వ తేదీ సాయంత్రం 6:30 గంటల సమయంలో రాజధాని నగరంలో రికార్డు స్థాయిలో 4,114 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదైంది. అలాగే సెప్టెంబర్ 30న నగర వినియోగం 85.85 మిలియన్ యూనిట్లు, అక్టోబర్ 1న 85.82 మిలియన్ యూనిట్లుగా నమోదై గ్రేటర్ చరిత్రలోనే అత్యధిక విద్యుత్ అవసరాలు గల నగరంగా నిలిచింది.

**దక్షిణ మండలం చరిత్రలోనే ఆల్‌టైమ్ హై..**

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోనూ డిమాండ్ చారిత్రాత్మక గరిష్ఠాన్ని తాకింది. సెప్టెంబర్ 25న 9,601 మెగావాట్లుగా నమోదైన డిమాండ్, సెప్టెంబర్ 30 నాటికి 12,299 మెగావాట్లకు చేరుకుని సంస్థ చరిత్రలోనే సరికొత్త మైలురాయిని అధిగమించింది. 2023లో 7,719 8,920 మెగావాట్లు, 2024లో 6,959 8,879 మెగావాట్లు, 2025లో 6,210 8,266 మెగావాట్ల మధ్య నమోదైన పరిస్థితితో పోలిస్తే.. 2026లో నిరంతరం ప్రతిరోజూ 10 వేల మెగావాట్లకు పైగా డిమాండ్ కొనసాగడం సంస్థ సర్వీస్ నెట్‌వర్క్ వేగాన్ని చాటుతోంది. వినియోగం పరంగా కూడా సెప్టెంబర్ 25న 185.79 మిలియన్ యూనిట్లు ఉండగా, సెప్టెంబర్ 30 నాటికి ఏకంగా 223.34 మిలియన్ యూనిట్లకు ఎగబాకింది.

**రాష్ట్రవ్యాప్తంగా 19,892 మెగావాట్లు..**

రాష్ట్రవ్యాప్త గణాంకాలను పరిశీలిస్తే తెలంగాణ ట్రాన్స్‌కో నెట్‌వర్క్‌పై ఊహించని భారం పడింది. సెప్టెంబర్ 30న రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 19,892 మెగావాట్ల గరిష్ట పీక్ డిమాండ్ నమోదైంది. అదే రోజున రాష్ట్ర విద్యుత్ వినియోగం ఏకంగా 327.56 మిలియన్ యూనిట్లను తాకింది. 2023లో ఇదే సమయంలో 11,861 13,753 మెగావాట్లు, 2024లో 10,554 14,003 మెగావాట్లు, 2025లో 8,577 11,357 మెగావాట్ల మధ్య మాత్రమే నమోదైన పరిస్థితి ఉండగా.. ఈ ఏడాది దాదాపు రోజూ 18,000 మెగావాట్లకు పైగా డిమాండ్ నమోదవుతుండటం గమనార్హం. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం, వరి సాగు పెరగడంతో వ్యవసాయ బోరు మోటార్లు నిరంతరం నడవడం మరియు పట్టణీకరణ వల్ల విద్యుత్ అవసరాలు ఆకాశాన్నంటాయి.

**డిమాండ్‌కు తగ్గట్టు మౌలిక వసతులు..**

పెరుగుతున్న రికార్డు డిమాండ్‌ను తట్టుకునేందుకు విద్యుత్ సంస్థలు సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు, అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల అమరిక, కొత్త ఫీడర్ల నిర్మాణం వంటి ముందస్తు చర్యలు చేపడుతున్నాయి. అయితే నగరాల్లో నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్న అధికారులు.. వ్యవసాయ రంగానికి వచ్చేసరికి కేవలం పగటి పూట మాత్రమే సరఫరా చేస్తూ, అందులోనూ కోతలు విధిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెదక్ జిల్లా సహా పలు ప్రాంతాల్లో పంట పొలాలకు 4 గంటలు కూడా విద్యుత్ అందడం లేదంటూ రైతులు సబ్‌స్టేషన్ల వద్ద రోడ్డెక్కి నిరసనలకు దిగుతున్నారు. ఒకవైపు రాష్ట్రంలో రికార్డు స్థాయి విద్యుత్ వినియోగం జరుగుతున్న వేళ, క్షేత్రస్థాయిలో అన్నదాతల ఆగ్రహాన్ని చల్లార్చడం డిస్కమ్‌లకు అతిపెద్ద సవాలుగా మారింది.

# పిల్లల ఆన్‌లైన్ భద్రతకు సమగ్ర 'చైల్డ్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్'

**హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 3:** పిల్లల ఆన్‌లైన్ భద్రతను రక్షించేందుకు తెలంగాణ హైకోర్టు, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలతో చర్చించి సమగ్ర చైల్డ్ ఆన్‌లైన్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్ ను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో హైదరాబాద్ వేదికగా శనివారం ప్రారంభమైన దక్షిణ మండల ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో పేదలు, బలహీన వర్గాలకు న్యాయాన్ని ఒక ఆయుధంగా అందించేందుకు న్యాయ సేవా సంస్థలు పనిచేస్తున్నాయని కొనియాడారు. ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల ఏ ఒక్కరూ న్యాయానికి దూరం కాకూడదనేది తమ ప్రభుత్వ ఆశయమని స్పష్టం చేశారు. ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల సాంకేతిక పురోగతి సాధించినప్పటికీ అమాయకులైన పిల్లలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే ప్రమాదం ఉందన్నారు. ఈ సదస్సుకు పిల్లల సైబర్ భద్రత అనే చాలా ముఖ్యమైన అంశాన్ని ఎంచుకున్నందుకు జస్టిస్ విక్రమ్ నాథ్‌కి, ఎన్ఏఎల్ఎస్ఏకు ధన్యవాదాలు తెలిపారు. ఈ రోజుల్లో పిల్లలు ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు. కానీ తమ పిల్లలు ఇంటర్నెట్‌లో ఏం చేస్తున్నారు అనేది చాలామంది తల్లిదండ్రులకు తెలియడం లేదు. ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మన జీవితాలను ఎంతో సులభం చేశాయి. ప్రపంచంలోని సమాచారం మన చేతిలోకి వచ్చింది. ఎక్కడున్న వారితోనైనా, ఎప్పుడైనా మాట్లాడగలుగుతున్నాం. కానీ పిల్లలు అమాయకులు. ఏది నిజం? ఏది అబద్ధం? ఏది మంచిది? ఏది ప్రమాదకరం? అన్నది వారు వెంటనే గుర్తించలేరు. తెలియక పిల్లలు చేసే చిన్న పొరపాట్లు కూడా పెద్ద సమస్యలకు దారితీయవచ్చు. వాటి ప్రభావం పిల్లలపైనే కాదు.. వారి కుటుంబాలపై, సమాజంపై కూడా పడుతుంది. ఇంటర్నెట్ ఈ నేరాలను సృష్టించలేదు. కానీ నేరాలను ప్రపంచవ్యాప్తంగా చేయడం మరింత సులభం చేసింది. తల్లిదండ్రులకు ఏం జరుగుతుందో తెలియకపోవచ్చు. భయంతో పిల్లలు తమ సమస్యలను ఎవరికీ చెప్పలేకపోవచ్చు. అందుకే పిల్లలపై సైబర్ నేరాలను ఎలా అరికట్టాలి? మన పిల్లలను ఎలా సురక్షితంగా ఉంచాలి? బాధిత పిల్లలకు న్యాయం ఎలా అందించాలి? మన ముందున్న ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మాట్లాడుతూ వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారో అవగాహనతో గమనించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లల రక్షణకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దేశంలోనే



తొలి 'చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు' ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని, షీభరోసా, సైబర్ ల్యాబ్‌లు, యాప్ ద్వారా ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. టీజీఎస్ఎల్ఎస్ఏ, పాఠశాల విద్యాశాఖ ఒప్పందం ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారని, ఇప్పటికే 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే బాధితులు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను సంప్రదించేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష పడటం కాదు. న్యాయం అంటే బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం. న్యాయం అంటే అతని గౌరవాన్ని తిరిగి ఇవ్వడం. ముఖ్యంగా ఒక బిడ్డ కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయం అని అన్నారు. న్యాయ సేవా సంస్థలు చేస్తున్న మంచి కార్యక్రమాలు రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు, ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. 'సంచార లోక్ అదాలత్' ప్రత్యేక వాహనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మెగ్వాల్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ వి.మోహన, జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ ఆర్. మహదేవన్, ప్రజాప్రతినిధులు, న్యాయ నిపుణులు పాల్గొన్నారు.

# అనంతగిరి ఘాట్ రోడ్డులో బస్సు బోల్తా

మొదటిపేజీ తరువాయి

పలువురికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. క్షతగాత్రుల్ని రక్షించేందుకు స్థానికులు, పోలీసులు రంగంలోకి దిగారు. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించారు. గాయపడిన వాళ్లను చికిత్స కోసం సమీపంలోని హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరొకరు కన్నుమూశారు. పటాన్‌చెరులోని కేసారంలో ఓ వ్యక్తి మరణించగా అతని అంత్యక్రియలు చింతకుంటలో నిర్వహించాల్సి ఉంది. ఈ కార్యక్రమం కోసం హాజరయ్యేందుకు 50మంది ప్రైవేట్ బస్సులో బయల్దేరారు. ఘాట్ రోడ్డు గుండా కిందకు దిగుతున్న సమయంలో డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో బస్సు వేగంగా రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఒక్కసారిగా పల్టీ కొట్టింది. ప్రమాదం జరగగానే ప్రయాణికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా భయాందోళనకరంగా మారింది.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ స్నేహా మెహ్రా**

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ప్రమాద స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును ఆరా తీశారు. అనంతరం హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. క్షతగాత్రులకు ఎలాంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి**

వికారాబాద్ బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఆయన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతగిరి హిల్స్ ఘాట్ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ప్రైవేటు బస్సు ప్రయాణికులు దుర్మరణం పాలైన ఘటనపై ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు బోల్తా పడిన ఘటనపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుటుందని తెలిపారు.

**ప్రమాదంపై హరీశ్ రావు తీవ్ర దిగ్భ్రాంతి**

బస్సు దుర్ఘటన పట్ల బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ తీవ్ర విషాద సమయంలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి, అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే, ఈ దుర్ఘటనలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని, సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొనాలి : కేటీఆర్**

బస్సు ప్రమాద ఘటన తీవ్రంగా కలచివేసిందని కేటీఆర్ అన్నారు. మృతుల కుటుంబాలకు 'ఎక్స్'లో తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులను వెంటనే రక్షించి, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు సహాయక చర్యల్లో పాల్గొనాలని స్థానిక బీఆరఎస్ నాయకత్వానికి సూచించారు.

# ప్రజాబాటలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

వారానికి రెండు రోజులు విద్యుత్ శాఖ అధికారులు నేరుగా ప్రజలతో మమేకమవుతూ గ్రామాలు, బస్తీలు, కాలనీలలో పర్యటిస్తుండటంతో వేలాది సమస్యలకు ఇట్టే పరిష్కారం లభిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, సూచనలను అధికారులు వెంటనే పరిశీలించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ.. విద్యుత్ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, విద్యుత్ అంతరాయాలను పూర్తిగా తగ్గించడం, ప్రజలకు ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా సురక్షితమైన మరియు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ప్రజాబాట బస్తీబాట కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని




వేగవంతమైన పరిష్కారం అందించేందుకు టీజీఎస్పీడీసీఎల్ యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోందన్నారు. విద్యుత్ సంబంధిత ఏ చిన్న సమస్య ఉన్నప్పటికీ ప్రజలు 1912 కాల్ సెంటర్, స్థానిక విద్యుత్ అధికారులను లేదా నేరుగా ప్రజాబాట బస్తీబాట కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 'ప్రజల వద్దకు సేవలు ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం' అనే నినాదంతో టీజీఎస్పీడీసీఎల్ ముందుకు సాగుతోందని సీఎండీ స్పష్టం చేశారు .ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి అక్టోబర్ 1, 2026 వరకు ప్రజాబాట – బస్తీబాట కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రధాన నిర్వహణ, భద్రతా పనుల వివరాలు ఇవి..

**డీటీఆర్ ఏబీ స్విచ్‌ల మరమ్మతులు: 5,521**

**డీటీఆర్ డిస్ట్రిబ్యూషన్ బాక్స్‌ల మార్పిడి: 2,885**

**డీటీఆర్ కేబుల్‌ల మార్పిడి: 4,924**

**హెచ్‌జీ ఫ్యూజ్ సెట్ల మరమ్మతులు: 3,870**

**డీటీఆర్ ప్లింత్ ఎత్తు పెంపు పనులు: 2,498**

**యార్డ్ క్లీనింగ్ పనులు: 16,827**

**వదులైన విద్యుత్ లైన్ల సవరణ, స్పేసర్ల ఏర్పాటు: 16,832**

**విద్యుత్ లైన్లపై పెరిగిన తీగలు, వృక్షలతల తొలగింపు: 8,384**

**చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ కట్టింగ్): 5,317**

**వంగిన, ఒరిగిన విద్యుత్ స్తంభాల సరిదిద్దడం: 6,399**

ఈ విధంగా మొత్తం 73,457కు పైగా నిర్వహణ, భద్రతా మరియు వినియోగదారుల సేవలకు సంబంధించిన సమస్యలను విజయవంతంగా గుర్తించి పరిష్కరించినట్లు వెల్లడించారు.

# కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

మొదటిపేజీ తరువాయి

రైలు, ఆర్టీసీ బస్సులో శనివారం ప్రయాణించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేష్, నవీన్ యాదవ్, అధికారులు కామన్ పాస్‌తో మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలువురు ప్రయాణికులతో నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం ఎలా ఉంది.. మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా.. ప్రయాణం సులభమైందా.. వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు.

**ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన**

కామన్ పాస్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు ప్రయాణికులు భట్టికి తెలిపారు. మెట్రోలో ప్రయాణించిన అనంతరం గమ్యస్థానానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల సమయం ఆదా అవుతోందని చెప్పారు. ప్రత్యేకంగా మరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకపోవడం సౌకర్యంగా ఉందన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత ఏ బస్సు ఎక్కాలి, ఏ మార్గంలో వెళ్లాలి అనే విషయంలో గతంలో ఎదురయ్యే అయోమయం కూడా తగ్గిందని ప్రయాణికులు వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో ఆర్టీసీ సేవలను అనుసంధానం చేయడం వల్ల రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతోందన్నారు.

**బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చట**

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి టీజీఎస్ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్ వరకు ప్రయాణించారు. బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చటిస్తూ కామన్ పాస్ వినియోగం, ప్రయాణ సౌకర్యం, మెట్రోబస్సు అనుసంధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

**ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరం: భట్టి**

ఆర్టీసీమెట్రో కామన్ పాస్ విధానం ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులను సమన్వయంతో వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అయోమయం తగ్గుతాయని తెలిపారు. మెట్రోలో ప్రయాణిస్తున్న మహిళలు, ఇతర ప్రయాణికులతో మాట్లాడగా కామన్ పాస్ విధానం సౌకర్యవంతంగా ఉందని వారు చెప్పారని భట్టి పేర్కొన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత తమ ఇల్లు, కార్యాలయం లేదా ఇతర గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణం మరింత సులభతరం అవుతున్నదని చెప్పారు. ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి ప్రయాణికులకు 'సీమ్‌లెస' ప్రయాణ అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ప్రస్తుతం మెట్రోఆర్టీసీ సేవలను అనుసంధానం చేశామని, భవిష్యత్తులో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్టి కృతజ్ఞతలు తెలిపారు.



**ప్రజా రవాణాను బలోపేతం చేస్తాం: పొన్నం**

హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో ఆర్టీసీమెట్రో కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే పాస్‌తో ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడం ముఖ్యమైన పరిష్కారమని అన్నారు. ప్రజలను వ్యక్తిగత వాహనాల నుంచి ప్రజా రవాణా వైపు ఆకర్షించాలంటే ఆర్టీసీ, మెట్రో సేవలను సమన్వయంతో, సౌకర్యవంతంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు డెయిలీ పాస్, మంత్లీ పాస్‌తోపాటు కామన్ పాస్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని కామన్ పాస్ సేవలను మరింత మెరుగుపరుస్తామని పొన్నం తెలిపారు. ప్రజలకు ఆర్థికంగా అందుబాటులో ఉండేలా మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్ భవిష్యత్తు అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంలో ప్రజా రవాణా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు (అర్బన్ ట్రాన్స్‌పోర్ట్‌మెట్రో) ఎన్.వి.ఎస్. రెడ్డి, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలే శ్రేయస్కరం

హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 3 :

ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగానే కాకుండా ప్రాజెక్టుల్లో నీటి కొరత నెలకొన్న నేపథ్యంలో, రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో రైతులు తక్కువ నీటితో, స్వల్పకాలంలో పండే ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. శనివారం ఉదయం ప్రసారమైన 'రైతు నేస్తం' 109వ ఎపిసోడ్‌లో పాల్గొన్న ఆయన, జాతీయ ఆహార భద్రతా మిషన్ జాతీయ నూనె గింజల మిషన్ పప్పుధాన్యాల మిషన్ కింద రబీ 202627 సీజన్‌కు సంబంధించిన పప్పుధాన్యాలు, నూనె గింజల సబ్సిడీ విత్తనాల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు.

**ప్రాజెక్టుల నీటి నిల్వల ఆధారంగా సాగు ప్రణాళికలు**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడూ నీటి కొరత తీవ్రతను దృష్ట్యా రైతులు ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ పెట్టుబడితో మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వులు, శనగలు, మినుములు, పెసలు వంటి పంటలను ఎంచుకోవాలని కోరారు. జిల్లాల వారీగా ఉన్న ప్రాజెక్టుల నీటి నిల్వల ఆధారంగా కలెక్టర్ల ఆధ్వర్యంలో పటిష్టమైన నీటి పారుదల ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతుల అభ్యర్థన మేరకు ఇతర పంటలకు సబ్సిడీపై స్ప్రింక్లర్లను అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఆయిల్‌పామ్ గెలల కోత అనంతరం వేగంగా ఫ్యాక్టరీలకు తరలించి, రైతులకు త్వరితగతిన బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**భారీ సబ్సిడీతో విత్తన పంపిణీ వివరాలు**

రైతులకు విత్తన రకం, మార్కెట్ విడుదల కాలం, నిబంధనల ఆధారంగా 50% నుంచి 75% వరకు, కొన్ని ప్రత్యేక రకాలకు 100% సబ్సిడీపై విత్తనాలు అందించబడుతున్నాయి. నూనె గింజల పంపిణీ పథకానికి రూ. 49.35 కోట్లు కేటాయించగా రూ. 34.55 కోట్లు విడుదలయ్యాయి. 52,425 ఎకరాల్లో సాగు కోసం 29,375 క్వింటాళ్ల విత్తనాలను రూ.36.76 కోట్ల సబ్సిడీతో అందిస్తున్నారు. వేరుశనగ: గిర్నార్4, గిర్నార్5, కదిరి లేపాక్షి, TCGS 894 (35,325 ఎకరాలు - రూ. 35.33 కోట్లు) కుసుమ ISF 764 / లక్ష్మీప్రియ (4,000 ఎకరాలు - రూ. 16.80 లక్షలు) పొద్దుతిరుగుడు SUNH1, KBSH 85 (4,500 ఎకరాలు - రూ. 53.32 లక్షలు) నువ్వులు JCS 1020 (7,400 ఎకరాలు - రూ.29.16 లక్షలు)

**పప్పు ధాన్యాల పంపిణీ**

పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు రూ. 34.60 కోట్లు కేటాయించగా, 21 జిల్లాల్లో 29,008 క్వింటాళ్ల విత్తనాలను రూ. 15.25 కోట్ల సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు.శనగలు NBeG452, NBeG47, NBeG49 (83,053 ఎకరాలు) మినుములు VBN8, VBN10 (16,958 ఎకరాలు) పెసలు MGG 385 (9,801 ఎకరాలు)

**రైతులకు అధికారుల విజ్ఞప్తి**

యాసంగిలో తక్కువ నీటితో లాభదాయక పంటలు సాగు చేసి ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందేందుకు రైతులు వెంటనే తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలు లేదా మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి విత్తనాలు పొందాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

# 'గ్రేటర్' అభివృద్ధికి పక్కా ప్రణాళికలు అవసరం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 3 :

గ్రేటర్ హైదరాబాద్ సమగ్ర అభివృద్ధి కేవలం నినాదాలతో సాధ్యం కాదని, పాలనా యంత్రాంగం పూర్తి సమన్వయంతో, ప్రజల అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించి పనిచేసినప్పుడే సాధ్యమవుతుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ జిల్లా 'దిశా' కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ మహానగరం విస్తరిస్తున్న కొద్దీ జిల్లాల సరిహద్దులు, కార్పొరేషన్లు వేరైనా నగరాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి తదితర జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసీ, సైబరాబాద్ పరిధిలోని ముగ్గురు మున్సిపల్ కమిషనర్లు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్లు, కమిషనర్లు తరచూ సంయుక్తంగా సమీక్షలు నిర్వహించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు సమకూరే మొత్తం ఆదాయంలో 70 నుండి 80 శాతం ఒక్క హైదరాబాద్ పరిసర జిల్లాల నుంచే వస్తోందని మంత్రి గుర్తు చేశారు. అలాంటి మహానగరంలో ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించే జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు వంటి సంస్థలు నిధుల కొరతతో సతమతం కావడం విచారకరమన్నారు. రొటీన్ బడ్జెట్ కేటాయింపులతో సరిపెట్టుకోకుండా నగర ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా బడ్జెట్ పెంచుకునేందుకు అధికారులు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మెట్రో, మూసీ సుందరీకరణ వంటి భారీ ప్రాజెక్టులు ప్రభుత్వ ఆలోచనల ప్రకారం జరుగుతున్నప్పటికీ సామాన్య ప్రజలు నిత్యం ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం, అధికారులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రోడ్ల మరమ్మతులు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ లీకేజీల నియంత్రణ, మురుగునీరువర్షపునీరు వేరు చేసే శాస్త్రీయ డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాల్లో అలసత్వం వహించరాదన్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రాని పరిస్థితి మారాలని, పనులన్నీ సకాలంలో పూర్తి కావాలని సూచించారు. పేదల బస్తీల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వ్యయంతో ఫ్లోరింగ్, టైల్స్, పెయింటింగ్, తాగునీటి వసతులు, పిల్లలకు దుప్పట్లు, యూనిఫాంలు వంటి సకల సదుపాయాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన అనుభవాన్ని ఆయన ప్రస్తావించారు. బస్తీల్లో ప్రాథమిక విద్య, వైద్యం, పారిశుధ్య వసతులను మెరుగుపరచడంలో అధికార యంత్రాంగం ఒక కుటుంబంలా బాధ్యతగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటికి సరిపోయేలా రాష్ట్ర అధికారులు సరైన డీపీఆర్‌లు, ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని స్పష్టం చేశారు. అధికారులు నిబంధనల ప్రకారం ప్రతిపాదనలు పంపితే కేంద్ర ప్రభుత్వం నుంచి హైదరాబాద్‌కు, తెలంగాణకు నిధులు మంజూరు చేయించి తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు.



# ఆటో కార్మికుల సంక్షేమానికి త్వరలో బోర్డు

- మానవీయ కోణంలో సమస్యల పరిష్కారం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రజా భవన్‌లో ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులకు ఆత్మీయ విందు
- హాజరైన మంత్రులు పొన్నం, అడ్లూరి

హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 3 :

ఆటో కార్మికులు, వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం త్వరలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆటో డ్రైవర్లు, రవాణా రంగ కార్మికుల న్యాయమైన సమస్యలన్నింటినీ మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. శనివారం రాత్రి ప్రజాభవన్‌లో హైదరాబాద్ నగర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆత్మీయ విందు ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆటో సంఘాల నాయకులతో భోజనం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో భట్టి మాట్లాడారు. ఆటో డ్రైవర్ల సమస్యలను రవాణా శాఖ మంత్రి పొన్నం లోతుగా అధ్యయనం చేసి కేబినెట్ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఆటో చార్జీల పెంపుపై డ్రైవర్లు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం కేబినెట్‌లో చర్చించి కిలోమీటరుకు రూ.11గా ఉన్న చార్జీని రూ.14కు పెంచుతూ జీవో జారీ చేసిందన్నారు. 2014లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే ఆటో చార్జీని కిలోమీటరుకు రూ.11గా నిర్ణయించిందని గుర్తు చేశారు. అనంతరం రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లపాటు అధికారంలో ఉన్న పాలకులు ఆటో డ్రైవర్ల సమస్యలను పట్టించుకోలేదని, వారు అనేక ఉద్యమాలు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని విమర్శించారు.

**సంక్షేమ బోర్డుపై కేబినెట్‌లో చర్చ**

రవాణా రంగంలో దాదాపు 20 లక్షల కార్మిక కుటుంబాలు ఉన్నాయని, వారి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్న అంశంపై ఇప్పటికే కేబినెట్‌లో చర్చించామని చెప్పారు. చట్ట సభల్లో చర్చించి, అవసరమైన నిధులు కేటాయించే ప్రక్రియను పూర్తి చేసి త్వరలోనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్ల ఇతర అంశాలపైనా కొంత సమయం తీసుకుని న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.కేవలం జీవోలు జారీ చేసి ప్రచారం చేసుకోవడం తమ ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. ప్రజాభవన్‌కు ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులను ఆహ్వానించి వారితో కలిసి భోజనం చేస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే ఈ సమావేశం ఉద్దేశమన్నారు. ప్రభుత్వం తమది, ప్రజలదే అనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు.

**డీజిల్ ఆటోలకు బదులు బ్యాటరీ ఆటోలు**

నగరం అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. నగరంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ వంటి నగరాల్లో కాలుష్యం కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. డీజిల్ ఆటోలను బ్యాటరీ ఆటోలుగా మార్చేందుకు 'రాజీవ్ యువ వికాసం' కింద రూ.200 కోట్లను కేటాయించామని తెలిపారు. ఒక్కో ఆటోకు ప్రభుత్వం తరఫున రూ.1.50 లక్షల సబ్సిడీ అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో సోలార్, బ్యాటరీ, సీఎన్‌జీ ఆటోలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో మానవతా దృక్పథంతో ముందుకు సాగుతున్న రవాణా శాఖ మంత్రి పొన్నంను భట్టి అభినందించారు.

# 22ఎ పరిష్కారంలో మరో కీలక అడుగు

మొదటిపేజీ తరువాయి

నెం.48062/య□ఎల్‌సీ/ఎ/1/2026 ద్వారా అర్హత ఉన్న దరఖాస్తులను కాల పరిమితిలో పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. 22ఎ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో వేగం పుంజుకుంది. ఇప్పటికే ప్రభుత్వం ఐదు ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు, జీవో 118, జీవో 76లకు అనుగుణంగా మార్గదర్శకాలు జారీ. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు ఉన్న 22ఎ ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి లభించింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న యూఎల్‌సి దరఖాస్తుల పరిష్కారానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజాగా నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యకు కూడా పరిష్కారం చూపింది. ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, 22ఎ సమస్యల పరిష్కారంపై నిరంతరం పర్యవేక్షణ□ చేయాలని రెవెన్యూ అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు.



# బ్యాలెట్‌తో ఎన్నికల్లోకి వెళ్లేందుకు సిద్ధమా?

హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 3 :

కేంద్ర ఎన్నికల కమిషన్‌పై, ఈవీఎంలపై పదేపదే ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. ఈవీఎంల వల్లే కాంగ్రెస్ పార్టీ కేరళ, తెలంగాణ, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో గెలిచింది కదా.. మరి ఆ నాలుగు రాష్ట్రాల సీఎంలు రాజీనామా చేసి ప్రభుత్వాలను రద్దు చేసి బ్యాలెట్‌తో మళ్లీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమా అని అడిగారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి శనివారం సాయంత్రం విచ్చేసిన కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ పార్టీ నేతలు డాక్టర్ మనోహర్ రెడ్డి, సంగప్ప, శ్రీవర్ధన్ రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కు, బీజేపీకి ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఆయన ఎన్డీయే మంత్రి కాదు.. సీఈసీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ అని చెప్పారు. అసలు ఇండి కూటమికి జనాదరణ లేదని, వాళ్ల ఆందోళన కార్యక్రమాలకు పట్టుమని పదిమంది కూడా రావడం లేదని, ముంబై, ఢిల్లీల్లో ఆందోళనలకు జనం పెద్దగా రాకపోవడమే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. 'సర' ప్రక్రియలో భాగంగా సీపీఎం దొంగ ఓట్లను తొలగించడంవల్లే కేరళలో అధికారంలోకి వచ్చామని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల చెప్పారు కదా.. మరి దీనికి కాంగ్రెస్ నేతలు ఏమంటారు అని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ రావాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలవల్ల ఆయన పర్యటన వాయిదా పడిందని బండి సంజయ్ తెలిపారు.

**మచ్చార్ ధైర్యసాహసాలపై స్పందించకపోవడం సిగ్గుచేటు**

ప్రపంచమంతా కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్య సాహసాలను కొనియాడుతుంటే రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలు కనీసం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. స్మిత్ మచ్చార్‌పై దాడి చేసిన వ్యక్తి సామాజికవర్గం ఓట్లు పోతాయోయేమోననే భయంతోనే వాళ్లు స్పందించడంలేదని, అలాంటి వాళ్లంతా తన దృష్టిలో దేశద్రోహులు, దిమాగీ నక్సల్సేనని అన్నారు.

**ఆలయంపై దాడి హేయనీయం**

దిల్‌సుక్‌నగర్‌లో సంతోషిమాత ఆలయంపై దాడి హేయనీయమన్నారు.. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో దాడి చేసిన వాళ్లపై చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. దాడి చేసిన మతం వాళ్లు బాధపడతారనే కారణంతో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రజలు ప్రశ్నిస్తే దాడి చేసినోడిని పిచ్చోడిగా చిత్రీకరించడం అలవాటైందని విమర్శించారు. పిచ్చోడికి మందిర్, మసీదు అనే తేడా తెల్వదు.. కానీ మందిరాలపైనే ఎందుకు దాడి చేస్తున్నారు అని అడిగారు. హిందువులు దీటుగా స్పందించకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం పద్ధతి మార్చుకుని దాడి చేసిన వాళ్లపై కఠినంగా వ్యవహరించాలని, లేకపోతే యువత రోడ్లపైకి వచ్చి తిరగబడితే వాళ్లను ఆపే పరిస్థితి ఉండదని హెచ్చరించారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే**

బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ విచారణ జరిపి చర్యలు తీసుకోదు.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుపై బీఆర్ఎస్ పోరాడదు అని మంత్రి బండి ఎద్దేవా చేశారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని సీబీఐకి ఎందుకు కాంగ్రెస్ ప్రభుత్వం లేఖ రాయలేదన్నారు. కేసీఆర్ కుటుంబానికి పూర్వమే చింతమడకలో వందల ఎకరాలున్నాయనడం పెద్ద జోక్ అంటూ ఆనాడు వాళ్లకు హైదరాబాద్‌లో అసలు ఇల్లే లేదు.. అధికారంలోకి వచ్చాకే ఇన్ని హోటళ్లు, ఆస్తులు ఎట్లా వచ్చాయి అని ప్రశ్నించారు. కాగా, టీచర్లు, గ్రాడ్యుయేట్లు, నిరుద్యోగ యువత బీజేపీ పక్షానే ఉన్నారని, గతంలో రెండు ఎమ్మెల్సీ సీట్లను తాము కైవసం చేసుకోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రజల్లో బీజేపీకి సానుకూలత ఉందని, ఖైరతాబాద్ ఉప ఎన్నికలోనూ బీజేపీ గెలుపు తథ్యం అని బండి సంజయ్ స్పష్టం చేశారు.



# నిరుద్యోగుల కలల సాకారమే ప్రభుత్వ లక్ష్యం

- రెవెన్యూ శాఖ మంత్రి మంత్రి పొంగులేటి
- పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 3:

నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు అండగా నిలిచేందుకు 'పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే ప్రతిభ, పట్టుదల ఉన్నప్పటికీ కేవలం ఆర్థిక పరిస్థితుల వల్ల ఎవరూ వెనుకబడకూడదన్నదే తమ ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా ఒక్కో అభ్యర్థికి సుమారు రూ. 40 వేల విలువైన ఆన్‌లైన్ కోచింగ్ యాక్సెస్‌ను పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పూర్తిగా ఉచితంగా అందిస్తామని నిరుద్యోగ యువతకు మంత్రి హామీ ఇచ్చారు. యువత ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత కొలువులు సాధించాలని ఆకాంక్షించారు.

# అంత్యక్రియలకు స్మశాన వాటిక కేటాయించండి




- **డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేత.**

**సదాశివపేట. అక్టోబర్ 3. (సిరిన్యూస్)**

సదాశివపేట పట్టణ పరిధిలోగల 7 వార్డు సిద్దాపూర్ గ్రామ ప్రజలకు స్మశాన వాటిక లేదని శనివారం వార్డు ప్రజలతో కలిసి డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సిద్ధాపూర్ స్మశాన వాటిక లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాళ్లు తమ కుటుంబీకులను వారికి సంబంధించిన పొలాలలో పెట్టుకోవడం ఇబ్బందికరంగా ఉందని, అలాగే సిద్దాపూర్ నుండి సదాశివపేట స్మశాన వాటికలో ఖననం చేయడానికి అభ్యంతరాలు ఇంతకు ముందు చాలాసార్లు చేసారని తెలియజేశారు.కాబట్టి సిద్దాపూర్ గ్రామ ప్రజలకు స్మశాన వాటిక కొరకు తగిన స్థలాన్ని కేటాయించమని గ్రామ పెద్దల సమక్షంలో అధికారులకు విన్నవించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొల్ల కృష్ణయ్య, యం డి ఐ, రామ్ రెడ్డి, ఎం ఆంజనేయులు, బి శంకరయ్య, బి శ్రీనివాస్, అనంతరం గౌడ్, ఎం లక్ష్మయ్య, జై చంద్రశేఖర్, ఎస్ సుధాకర్, గూడెం మాధవరెడ్డి, అయుబ్ పాషా, ఖలీల్ గ్రామస్తులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల డిమాండ్లపై సర్కార్ తక్షణమే స్పందించాలి: మెట్టు శ్రీధర్

**పటాన్‌చెరు, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**



జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. అర్హులైన జర్నలిస్టులకు నిబంధనల ప్రకారం ఇంటి స్థలాలు కేటాయించాలని, వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఆరోగ్య సదుపాయాలు కల్పించేలా ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఎలాంటి జాప్యం లేకుండా అక్రిడిటేషన్ కార్డులు అందించాలన్నారు. జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులు, బెదిరింపులను అరికట్టేందుకు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ఉద్యోగుల ఆర్థిక, ఉద్యోగ భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని శ్రీధర్ కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే జర్నలిస్టు సంఘాలతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ప్రజా సమస్యలే లక్ష్యంగా పుష్పనగేష్..



- **నిధుల మంజూరుకు మంత్రి వివేక్ హామీ**

**రామచంద్రాపురం, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**

ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్న తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. రామచంద్రాపురం డివిజన్‌లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. డివిజన్‌లోని ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన పుష్పనగేష్.. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, ప్రభుత్వంతో చర్చించి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి హామీపై పుష్పనగేష్ హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# కళ్యాణ లక్ష్మీకి 12 ఏళ్లు.. కేసీఆర్‌కు పాలాభిషేకం..







- **పేదింటి పెద్దగా నిలిచిన కేసీఆర్**
- **తులం బంగారం హామీ ఏమైంది?**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే జీఎంఆర్, ఆదర్శ్ రెడ్డి విమర్శలు**

**పటాన్‌చెరు, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**

నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించి, పెద్ద కొడుకులా, మేనమామలా అండగా నిలిచిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెన్నవరం ఆదర్శ్ రెడ్డి అన్నారు. కళ్యాణ లక్ష్మీ పథకం ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు డివిజన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా కళ్యాణ లక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టి పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 2014 నుంచి 2023 వరకు లక్షలాది నిరుపేద కుటుంబాలకు ఈ పథకం అండగా నిలిచిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మీకి అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు గడుస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. కోర్టు కేసులను సాకుగా చూపి హామీ నుంచి తప్పించుకోవడం సరికాదన్నారు. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే తెలంగాణ ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పి, కళ్యాణ లక్ష్మీ ఆర్థిక సాయంతో పాటు హామీ ఇచ్చిన తులం బంగారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను గుర్తు చేసి ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకే కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనంతగిరి బస్సు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే జీఎంఆర్ అండ





- **క్షతగాత్రుల వైద్యానికి రూ.2 లక్షలు చెల్లింపు.. వైద్య ఖర్చులు భరిస్తానని హామీ**

**పటాన్‌చెరు, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**

అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన బస్సు ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి (జీఎంఆర్) తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించి, మృతుల కుటుంబాలను ఓదార్చారు. ప్రమాదంలో గాయపడి వికారాబాద్‌లోని ఈషా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే పరామర్శించి వైద్య సేవలను పరిశీలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచిస్తూ చికిత్స కోసం రూ.2 లక్షలు ఆసుపత్రికి చెల్లించారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్య ఖర్చులను తానే భరిస్తానని కుటుంబాలకు హామీ ఇచ్చారు. ప్రమాదానికి కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన వారంతా పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందినవారేనని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# ఈఎస్ఐ కార్మికులకు వైద్య భరోసా

- **18 డిస్పెన్సరీల్లో మందుల కొరతకు చెక్**
- **365 రోజులూ లైఫ్ సేవింగ్ డ్రగ్స్, ల్యాబ్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశాలు**

**రామచంద్రాపురం, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**




రామచంద్రాపురం ఈఎస్ఐ నోడల్ సెంటర్ పరిధిలోని 18 డిస్పెన్సరీల్లో మందులు, వైద్య సామగ్రి కొరతకు పరిష్కారం లభించింది. అత్యవసర జీవరక్షక మందులు, ల్యాబ్ పరీక్ష కిట్లు, సర్జికల్ సామగ్రిని నిబంధనల ప్రకారం సేకరించి నిరంతరం అందుబాటులో ఉంచాలని తెలంగాణ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల కాపీని సీఐటీయూ నాయకుడు, ఈఎస్ఐ బోర్డు మాజీ సభ్యుడు బి.అర్జున్ రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్, నోడల్ సెంటర్ అధికారి రమేష్‌కు అందజేశారు. ప్రతి డిస్పెన్సరీలో 365 రోజులూ అవసరమైన లైఫ్ సేవింగ్ డ్రగ్స్, ల్యాబ్ కిట్లు, సర్జికల్ సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మందుల కొరతతో కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సీఐటీయూ చేసిన కృషితోనే ఉత్తర్వులు వెలువడ్డాయని అర్జున్ తెలిపారు. ఆదేశాలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ప్రతి డిస్పెన్సరీలో మందులు, వైద్య సామగ్రి నిరంతరం అందుబాటులో ఉండే వరకు సీఐటీయూ పర్యవేక్షణ కొనసాగిస్తుందని తెలిపారు.



# కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ సర్వీస్ రోడ్డులో అస్తవ్యస్త పరిస్థితి:

- **నిలువునా నరకం చూస్తున్న వాహనదారులు, బాటసారులు**

**కూకట్ పల్లి / సిరి న్యూస్ /అక్టోబర్ 3**

కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ పరిధిలోని సర్వీస్ రోడ్డు ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు తీవ్ర అవస్థలు కలిగిస్తోంది. ఒకవైపు పార్కింగ్, మరోవైపు భారీ గుంతలు ఏర్పడి రోడ్డు వినియోగానికి ఏమాత్రం వీలులేకుండా తయారైంది. ప్రతినిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ రోడ్డులో రాకపోకలు సాగించడమంటే నరకయాతనను అనుభవించడమేనని స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డు సమస్యను పరిష్కరించలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు



# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- **బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం**
- **చేగుంట ఉప సర్పంచ్ రఫీ**

**శివంపేట్ అక్టోబర్ 3 (సిరి న్యూస్ )**

చేగుంట మండలం చందాయిపేట గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువకుడు సమీర్ రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. యువకుడి మృతి పట్ల చేగుంట గ్రామ ఉప సర్పంచ్ రఫీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే బాధిత కుటుంబాన్ని శివంపేట్ మండలం శభాష్‌పల్లి గ్రామం మృతుడి అమ్మమ్మ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి తన సొంత నిధుల నుండి రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంత్యక్రియలకు, కుటుంబ అవసరాలకు ఈ సాయం ఉపయోగపడుతుందని తెలిపారు. మృతుని కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, ప్రభుత్వం నుండి రావాల్సిన సహాయం అందేలా కృషి చేస్తామని ఉప సర్పంచ్ రఫీ హామీ ఇచ్చారు.



# కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే





**కూకట్ పల్లి /సిరి న్యూస్/అక్టోబర్ 3**

స్థానిక మహిళల చిరకాల కోరికను నెరవేరుస్తూ కబీర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కూకట్‌పల్లి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ మాధవరం కృష్ణారావు గారు ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. తదానంతరం మోతి నగర్ వార్డ్ కార్యాలయంలో SIR ఓటర్ జాబితా పరిశీలన, నమోదు ప్రక్రియను తనిఖీ చేసి అర్హత ఉన్న ఏ ఒక్కరు ఓటు హక్కును కోల్పోకూడదు అని ఎమ్మెల్యే తెలియజేసారు... ఎమ్మెల్యే చొరవతో కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి వచ్చినందుకు స్థానిక మహిళలు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, నాయకులు స్థానికులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

# అనంతగిరి ఘాట్ రోడ్డు ప్రమాదం.. బాధిత కుటుంబాలకు భరోసా

- **క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు, కాట శ్రీనివాస్‌గౌడ్**

**పటాన్‌చెరు, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**



వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన వారిలో పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన వారు ఉన్నట్లు తెలుసుకున్న కాట శ్రీనివాస్‌గౌడ్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన శ్రీధర్‌బాబు, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు అవసరమైన అన్ని రకాల వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సింగతి కుటుంబానికి నాతరి అండ..

- **సింగతి మల్లయ్య మృతితో కుటుంబంలో విషాదం..**
- **కుటుంబ సభ్యులను పరామర్శించిన నాతరి స్వామి..**
- **మల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన..**
- **సింగతి కుటుంబానికి నాయకుల ప్రగాఢ సానుభూతి..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3 (సిరి న్యూస్)**

బెల్లంపల్లి మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సింగతి సత్యనారాయణ తండ్రి సింగతి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో బెల్లంపల్లి మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి శనివారం మల్లయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లయ్య మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నాతరి స్వామి మల్లయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. మల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ కుటుంబానికి చెందిన సింగతి సత్యనారాయణ తండ్రి మృతి విషయం తెలుసుకుని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కుటుంబాన్ని పరామర్శిస్తూ సానుభూతి తెలిపారు. మల్లయ్య మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు భాకం కొమురయ్య, వార్డు సభ్యులు బొలిశెట్టి సుధాకర్, చిలుముల వెంకటస్వామి, రంటెం కి హరికృష్ణ, బాకం అంజయ్య, సింగతి అర్జయ్య, అచ్చ సత్తయ్య, చింతం స్వామి తదితరులు పాల్గొని సింగతి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



# నీటి ఎద్దడిపై ముందస్తు ప్రణాళికలు

- **అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**పటాన్‌చెరు, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**



ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధికారులను సూచించారు. పటాన్‌చెరులోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, జలమండలి, మిషన్ భగీరథ, విద్యుత్, గృహనిర్మాణ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐదు మున్సిపాలిటీల పరిధిలో రూ.75 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జలమండలి, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గండి గూడెం, జానకంపేట, బొమ్మన కుంట ప్రాంతాల్లో రూ.10 లక్షలతో నూతన పైపులైన్ నిర్మించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. పోచారం, లకడారం సబ్‌స్టేషన్లను అక్టోబర్ రెండో వారంలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. మాదారం, ఘనాపూర్, కొల్లూరు, నాగులపల్లిలో కొత్త సబ్‌స్టేషన్లకు ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. గడ్డపోతారం మున్సిపల్ అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తే సహించేది లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హులైన పేదలకు ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడు రామాయంపేటలో విశ్వ కల్యాణ మహాయజ్ఞం

- **శ్రీ సాందీపని వేద గురుకులంలో గోపూజ, గోదానం..**
- **పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం..**
- **బాల సంస్కార్ కేంద్రాల ప్రారంభం**
- **సాందీపని వేద గురుకుల కార్యదర్శి, వ్యవస్థాపకులు పడకంటి సంగమేశ్వర్ గుప్తా.**

**రామాయంపేట, అక్టోబర్ 3 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని శ్రీ సాందీపని వేద గురుకులము, శ్రీ కృష్ణ వేద గోశాల ఆధ్వర్యంలో ఆదివారం (అక్టోబర్ 4) విశ్వకల్యాణ మహాయజ్ఞం, గోపూజ, గోదానం తదితర ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు. గత తొమ్మిదేళ్లుగా రామాయంపేటలో వేద విద్యను సంరక్షిస్తూ, వేద సంప్రదాయాలను భావితరాలకు అందిస్తున్న శ్రీ సాందీపని వేద గురుకులంలో ఈ మహత్తర కార్యక్రమం జరగనుంది. ఈ వేడుకకు నిగమనీడము వేద గురుకులము, వేదామృత సన్యాస ఆశ్రమం పిడిచెడు, మరియు రామాయంపేట సాందీపని వేద గురుకుల వ్యవస్థాపకులు పూజ్యశ్రీ స్వామి చిదానంద సరస్వతి, వాచస్పతి డాక్టర్ మట్టి కృష్ణారెడ్డి ఆర్య ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. వేద మంత్రోచ్చారణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గురుకుల ప్రాంగణం భక్తిశ్రద్ధలతో నిండిపోనుంది. ఆదివారం ఉదయం 9:45 గంటలకు ఓంకార ధ్వజారోహణంతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం 10 గంటలకు గోపూజ, గోదానం నిర్వహిస్తారు. 10:45 గంటలకు విశ్వకల్యాణ మహాయజ్ఞం ప్రారంభం కానుంది. 11:15 గంటలకు సభా సమావేశం జరుగుతుంది.ఈ సందర్భంగా భాజాపూర్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులను సభా వేదికపై ఘనంగా సన్మానించనున్నారు. సమాజ ఆరోగ్యం, పరిశుభ్రత కోసం



సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం ద్వారా వారి సేవలను గుర్తించనున్నారు. అదే విధంగా భాజాపూర్, రామాయంపల్లి గ్రామాల్లో బాల సంస్కార్ కేంద్రాలను ప్రారంభించనున్నారు. చిన్నారుల్లో నైతిక విలువలు, సంస్కారం, భారతీయ సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భాజాపూర్ గ్రామానికి వైకుంఠ రథాన్ని ఉచితంగా అందించే కార్యక్రమం కూడా ఈ వేడుకలో నిర్వహించనున్నారు. ఆధ్యాత్మికతతో పాటు వేద పరిరక్షణ, గోసేవ, బాలల్లో సంస్కార వికాసం, సామాజిక సేవకు ప్రాధాన్యం కల్పిస్తూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భక్తులు కుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీ సాందీపని వేద గురుకుల కార్యదర్శి, వ్యవస్థాపకులు పడకంటి సంఘమేశ్వర్ గుప్తా కోరారు.

# కాలనీల సమస్యలపై అధికారులతో పుష్పనగేష్ పర్యటన



**రామచంద్రాపురం, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**

డివిజన్‌లోని సాయి నగర్, మల్లికార్జున నగర్, ఎస్బీ అవతార్ అపార్ట్‌మెంట్స్ సమస్యల పరిష్కారానికి తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. సాయి నగర్‌లో పార్కు, కాంపౌండ్ వాల్, కమ్యూనిటీ హాల్, రిటైనింగ్ వాల్, అవతార్ అపార్ట్‌మెంట్స్ చుట్టూ రిటైనింగ్ వాల్, మల్లికార్జున నగర్‌లో లిఫ్ట్, ఇతర అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. రూ.70 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కూడా పరిశీలించారు. సమస్యలపై వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పుష్పనగేష్ అధికారులను కోరారు. ప్రతిపాదనలు అందిన అనంతరం జోనల్ కమిషనర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# ఏఐ ఆధారిత మధుమేహ అంచనాపై పరిశోధనకు పీహెచ్‌డీ

**పటాన్ చెరు, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**



గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఈసీఈ విభాగం అధ్యాపకుడు సంతోష్ కుమార్ బెజుగం పీహెచ్‌డీకి అర్హత సాధించారు. 'హైబ్రిడ్ డీప్ ఎన్సెంబుల్ నెట్‌వర్క్‌తో మధుమేహ అంచనా' అంశంపై ఆయన పరిశోధన చేశారు. ముందస్తుగా మధుమేహ ప్రమాదాన్ని గుర్తించేందుకు అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత విధానం 98.98 శాతం అంచనా కచ్చితత్వాన్ని సాధించినట్లు పరిశోధనలో వెల్లడైంది. ఈ సాంకేతికత క్లినికల్ నిర్ణయ మద్దతు, ధరించగలిగే ఆరోగ్య పరికరాల్లో ఉపయోగపడే అవకాశం ఉందని తెలిపారు. పరిశోధనకు గీతం ఈఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.జ్యోతి మార్గదర్శకత్వం వహించారు. సంతోష్ కుమార్‌ను గీతం అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



**రామచంద్రాపురం, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**

డివిజన్‌లో గతంలో మంజూరైన అభివృద్ధి పనుల పురోగతిని తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఓల్డ్ రామచంద్రాపురంలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న మీట్ మార్కెట్, శ్రీనివాస్‌నగర్‌లో రూ.2 కోట్లతో చేపడుతున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులను పరిశీలించారు. మీట్ మార్కెట్ పనులు తుది దశకు చేరుకున్నందున త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పాషా కాలనీలో మంజూరైన ఓపెన్ డ్రెయిన్, సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని, మల్టీపర్పస్ హాల్ పనులను వేగవంతం చేయాలని అధికారులను పుష్పనగేష్ కోరారు.

# చాకరిమెట్ల ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు



**శివ్వంపేట, అక్టోబర్ 1 (సిరి న్యూస్):**

మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి సతీమణి ఆర్. రాజిత రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి చాకరిమెట్ల స్వయంభూ శ్రీ సహకార ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ బి. ఆంజనేయ శర్మ తీర్థప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అర్చకులు, కార్యనిర్వహణాధికారి సార శ్రీనివాస్ రాజిత రెడ్డిని శాలువాతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

# ఆదివాసీ భూములకు రక్షణ ఏదీ?..

- సాగు భూముల్లో మొక్కలు నాటితే సహించం..
- అటవీ హక్కుల చట్టం–2006 ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలి..
- కోనంపేట భూములను వెంటనే సర్వే చేయాలి..
- మొక్కలు నాటితే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆదివాసీలు హెచ్చరిక..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03 (సిరి న్యూస్)**



ఆదివాసీల సాగు భూములను కాపాడుకునేందుకు పోరాటం తప్పదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు భాగాల రాజన్న హెచ్చరించారు. నెన్నెల మండలం కోనంపేటలో ఆదివాసీ రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీ శాఖ మొక్కలు నాటేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కోనంపేట ఆదివాసీల సాగు భూములపై అటవీ శాఖ అధికారులు ఒత్తిడి తెస్తున్నారని రాజన్న ఆరోపించారు. గతంలో పంటలను పశువులతో మేపించడం, పంటలను ధ్వంసం చేయడం జరిగిందని, ప్రస్తుతం అదే భూములను స్వాధీనం చేసుకునేలా మొక్కల పెంపకానికి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. తమ సాగు భూములను వదిలి మరోచోట మొక్కలు నాటుకోవాలని ఆదివాసీలు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు..

**హక్కు పత్రాలు లేకపోవడం అధికారుల వైఫల్యమే..**

అటవీ హక్కుల చట్టం, 2006 ప్రకారం అర్హత ఉన్న ఆదివాసీల హక్కులను గుర్తించాల్సి ఉన్నప్పటికీ, కోనంపేటలో అటవీ హక్కుల గ్రామ కమిటీ ఏర్పాటు చేయకపోవడంతో భూముల సర్వే జరగలేదని రాజన్న అన్నారు. దీంతో అర్హులైన ఒక్క ఆదివాసీ రైతుకు కూడా హక్కు పత్రం అందలేదని తెలిపారు. గత ఏడాది పోరాటాల ఫలితంగా గ్రామ కమిటీ ఏర్పాటు చేసినా, సాగు భూముల సర్వే మాత్రం చేపట్టలేదని ఆరోపించారు..

**సాగు భూముల జోలికి వస్తే సహించం..**

ఆదివాసీల భూములను కాపాడాల్సిన అధికారులు వాటిలోనే మొక్కలు నాటేందుకు ప్రయత్నించడం అన్యాయమని రాజన్న అన్నారు. అర్హులైన ఆదివాసీలకు హక్కులను గుర్తించి పట్టాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, స్థానిక ప్రజాప్రతినిధులు బాధితుల పక్షాన స్పందించకపోవడం విచారకరమన్నారు. కోనంపేట ఆదివాసీల సాగు భూముల్లో మొక్కలు నాటితే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి భోగారపు మల్లేష్, మండల ఉపాధ్యక్షులు జంపము లచ్చన్న, జంబి లక్ష్మయ్య, బండి బాపు, మంగిరి మాధవి, ధర్మయ్య, లక్ష్మి, మారక్క, వనిత, శంకర్‌తో పాటు పలువురు ఆదివాసీలు పాల్గొన్నారు.



# కృష్ణారెడ్డి పెట్ ' పటేల్ గూడ లో సిసి రోడ్లు మంజూరు చేయాలి




- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి

**అమీన్పూర్ అక్టోబర్ 03 సిరి న్యూస్**

అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట్ పటేల్ గూడా ప్రాంతాల్లో ఎదురవుతున్న రహదారుల సమస్యలపై పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి,జోనల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ... స్థానిక ప్రజలు వాహనదారులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే కొత్త సిసి రోడ్లను మంజూరు చేయాలని ఆయన కోరారు. గుంతల రోడ్ల వల్ల కాలనీవాసులు పడుతున్న అవస్థలను వివరించి యుద్ధ ప్రాతిపదికణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, శ్రీనివాస్ గౌడ్, మల్లేశ్, సాయిలు, రమేశ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మామునూరు ఎయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

- కురుమల ఆత్మగౌరవానికి ఇదే సరైన గుర్తింపు: బండారి పాండు



**మునిపల్లి, అక్టోబర్ 3 (సిరి న్యూస్):**

వరంగల్ జిల్లా మామునూరులోని ఎయిర్‌పోర్టుకు తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ పేరు పెట్టాలని సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం సీనియర్ నాయకుడు బండారి పాండు కురుమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పీడిత ప్రజల పక్షాన నిలిచి అమరుడైన కొమురయ్య త్యాగాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ మరిచిపోకూడదన్నారు. ఒకే కుటుంబానికి చెందిన దొడ్డి కొమురయ్య, దొడ్డి మల్లయ్య అమరులై ఆ కుటుంబం ప్రాణ, ఆర్థిక నష్టాలను చవిచూసిందని పాండు కురుమ తెలిపారు. దొడ్డి కొమురయ్య పేరు ఎయిర్‌పోర్టుకు పెట్టడం కేవలం ఒక పేరు మార్పు కాదని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రకు, అమరుల త్యాగాలకు ఇచ్చే గౌరవమని అన్నారు. కురుమల ఆత్మగౌరవాన్ని కాపాడేలా ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య కురుమ పేరు పెట్టాలని, ఈ డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేదారినాథ్ పాటిల్

**రాయికోడ్, అక్టోబర్ 03(సిరిన్యూస్):**

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా కృషి చేస్తానని రాయికోడ్ మండలం నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేదారి నాథ్ పాటిల్ అన్నారు. రాయికోడ్ గ్రామానికి చెందిన కేదారినాథ్ పాటిల్ ను రాయికోడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా మంత్రి దామోదర్ రాజ నర్సింహా, కాంగ్రెస్ పార్టీ నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కేదారినాథ్ పాటిల్ సర్పంచ్ గా, ఎంపిటిసి గా మార్కెట్ కమిటీ చైర్మన్ గా, వివిధ పదవుల్లో బాధ్యతలు నిర్వహించారు. వారికృషిని గుర్తించి మంత్రి దామోదర్ రాజా నర్సింహా కేదారినాథ్ పాటిల్ పై పార్టీ బాధ్యతలు అప్పజెప్పారు. ఈ సందర్భంగా కేదారినాథ్ పాటిల్ మాట్లాడుతూ మంత్రి దామోదర్ రాజానర్సింహా, గ్రంథాలయ చైర్మన్ ఎంజయ్య, సహా పలువురు కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్లాస్టిక్ పై మున్సిపల్ అధికారుల ఉక్కుపాదం

- మెదక్ పట్టణంలో రూ.17వేల ఐదు వందల జరిమానా.

**మెదక్ అక్టోబర్,03(సిరి న్యూస్)**

మెదక్ పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల పై మున్సిపల్ అధికారులు శనివారం ఉక్కుపాదం మోపారు.ఘన వ్యర్థ పదార్థాల నియమావళి 2026 అనుసరించి,తనిఖిలలో భాగంగా ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ ఎ.నాగరాజు,వార్డ్ ఆఫీసర్ దాయమని మరియు సానిటరీ జవాన్లు మెరుపు దాడులు చేశారు.పట్టణంలోని పిల్లిడి లోని క్రిస్టల్ గార్డెన్ పక్కన కిరాణా షాప్ లో మరియు న్యూ బస్టాండ్ దగ్గర దుకాణములలో

రైడ్ చేపట్టగా ప్లాస్టిక్ కవర్లు లభించాయన్నారు.వారికి మొత్తం రూ.17వేల ఐదు వందల రూపాయల జరిమానా విధించడం జరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట ప్లాస్టిక్ కవర్లలను ప్రభుత్వం నిషేదించిందని తెలిపారు. ప్లాస్టిక్ వాడటానికి బదులుగా ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులు,బట్ట సంచులు, స్టీల్ డబ్బాలు మొదలగు ప్లాస్టికేతర వస్తువులు వాడాలని సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



- బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం
- చేగుంట ఉప సర్పంచ్ రఫీ

**శివంపేట్ అక్టోబర్ 3 ( సిరి న్యూస్ )**

చేగుంట మండలం చందాయిపేట గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువకుడు సమీర్ రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. యువకుడి మృతి పట్ల చేగుంట గ్రామ ఉప సర్పంచ్ రఫీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే బాధిత కుటుంబాన్ని శివంపేట్ మండలం

శభాష్ పల్లి గ్రామం మృతుడి అమ్మమ్మ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి తన సొంత నిధుల నుండి రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంత్యక్రియలకు, కుటుంబ అవసరాలకు ఈ సాయం ఉపయోగపడుతుందని తెలిపారు. మృతుని కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, ప్రభుత్వం నుండి రావాల్సిన సహాయం అందేలా కృషి చేస్తామని ఉప సర్పంచ్ రఫీ హామీ ఇచ్చారు.

# బహుజన సభకు భారీ పిలుపు

- సభకు వేలాదిగా తరలిరావాలి: కాదాశి రవీందర్..
- కాన్షిరాం ఆశయాల సాధనకు సంకల్పం..
- సభ గోడపత్రుల ఆవిష్కరణలో నాయకులు..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03 (సిరి న్యూస్)**




బహుజన రాజ్యాధికార సాధన లక్ష్యంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సంకల్ప సభకు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కాదాశి రవీందర్ పిలుపునిచ్చారు. మాన్యవర్ కాన్షిరాం వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న సభకు సంబంధించిన గోడపత్రులను మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ సమావేశ ప్రాంగణంలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాదాశి రవీందర్ హాజరై మాట్లాడారు. బహుజన రాజ్యాధికార సంకల్పాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సభ కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు. మాన్యవర్ కాన్షిరాం ఆశయాల సాధనకు బహుజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి పెట్టం చంద్రశేఖర్, నియోజకవర్గ అధ్యక్షుడు బండారి రాజుకుమార్ పాల్గొన్నారు.

# రామాయంపేట సబ్ స్టేషన్ ముందు అన్నదాతల ఆక్రందన..





- కరెంటు కోతలపై రైతుల కన్నెర్ర
- 24 గంటల ఉచిత విద్యుత్ హామీ ఎక్కడ?
- నాలుగు గంటలు కూడా సరఫరా కావడం లేదని ఆగ్రహం.

**రామాయంపేట, అక్టోబర్ 3 (సిరి న్యూస్)**

రామాయంపేట పట్టణంలోని సబ్ స్టేషన్ ముందు అన్నదాతలు కన్నెర్ర చేశారు. కరెంటు కోతలపై అధికారులను నిలదీస్తున్నారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయి అంటూ రైతులు నిలదీస్తున్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తూ రామాయంపేట మండలానికి చెందిన రైతులు శుక్రవారం రామాయంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. సబ్‌స్టేషన్ ముందు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు మండిపడ్డారు. కనీసం నాలుగు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. విద్యుత్ అంతరాయాలతో బోర్లు నడవక పొలాలకు సాగునీరు అందడం లేదని, దీంతో చేతికొచ్చే దశలో ఉన్న పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో నిరంతరాయంగా విద్యుత్ అందించాలని రైతులు డిమాండ్ చేశారు. కనీసం 12 గంటలపాటు విద్యుత్ సరఫరా ఉంటే బోర్ల ద్వారా పంటలకు నీరు అందించి పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరిగి సాగు వ్యయం భారీగా పెరిగిందని, ఇప్పుడు విద్యుత్ కోతల కారణంగా పంటలు దెబ్బతింటే పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రావని వాపోయారు. విద్యుత్ శాఖ సిబ్బంది తీరుపై కూడా రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తినప్పుడు సిబ్బంది డబ్బులు అడుగుతున్నారని కొందరు రైతులు ఆరోపించారు. ఫ్యూజ్ వైర్ వేయడానికి రూ.300 వరకు, వైరు మార్చేందుకు సుమారు రూ.1,500 వరకు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. డబ్బులు ఇవ్వకపోతే పనులు చేయడం లేదని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై అధికారులు రైతులకు సరైన సమాచారం ఇవ్వడం లేదని రైతులు ఆరోపించారు. రామాయంపేట విద్యుత్ శాఖ ఏఈ తిరుపతిరెడ్డి తీరుపైనా రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యుత్ సమస్యలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలు ఎండిపోయిన తర్వాత చర్యలు తీసుకుంటే ప్రయోజనం ఉండదని, వెంటనే విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించాలని రైతులు కోరారు. వ్యవసాయానికి ప్రకటించిన ఉచిత విద్యుత్‌ను సక్రమంగా అందించడంతోపాటు విద్యుత్ అంతరాయాలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రైతుల ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.



# మావోయిజం నుంచి వెండితెరకు..

- తొమ్మిది మంది మాజీ మహిళా మావోయిస్టులకు ఛాన్స్
- ర్యాంప్‌వాక్ వీడియోలతో బాలీవుడ్ నిర్మాతల దృష్టిని ఆకర్షించిన మాజీ మావోయిస్టులు
- 1994 బస్తర్ ఘటన ఆధారంగా సినిమా తెరకెక్కించే ప్రయత్నాలు
- ఆడిషన్ల తర్వాత ఎంపికైన వారికి ప్రత్యేక నటనా శిక్షణ
- నవంబర్, డిసెంబర్‌లో బస్తర్ అటవీ ప్రాంతాల్లో షూటింగ్

**హైదరాబాద్, అక్టోబర్ 3:**

హింసా మార్గాన్ని వీడి సాధారణ జీవనంలోకి అడుగుపెట్టిన తొమ్మిది మంది మాజీ మహిళా మావోయిస్టులకు వెండితెరపై తమ జీవితాను భవాలను ప్రతిబింబించే అవకాశం దక్కనుంది. మావోయిజం నేపథ్యంలో తెరకెక్కనున్న ఓ బాలీవుడ్ చిత్రంలో వీరిని కొన్ని కీలక పాత్రల కోసం పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో లొంగిపోయిన మహిళా మావోయిస్టులు ర్యాంప్‌వాక్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బాలీవుడ్ చిత్ర నిర్మాతల దృష్టి వారిపై పడింది.

**నిజ జీవిత అనుభవాలే బలం**

మావోయిస్టుల జీవితాల ఆధారంగా ఓ చిత్రాన్ని రూపొందించేందుకు బాలీవుడ్‌కు చెందిన ఓ నిర్మాత సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. సినిమాలోని కొన్ని పాత్రలకు మాజీ మహిళా మావోయిస్టులను ఎంపిక చేయాలని చిత్రబృందం భావిస్తోంది. మావోయిజం ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూసిన వారి అనుభవాలు పాత్రలకు



సహజత్వాన్ని తీసుకొస్తాయని మేకర్స్ అభిప్రాయపడుతున్నారు.

ఆడిషన్ల ద్వారా నటులను ఎంపిక చేసి, ఎంపికైన మాజీ మావోయిస్టులకు ప్రత్యేకంగా నటనలో శిక్షణ ఇవ్వనున్నారు. 1994లో బస్తర్ ప్రాంతంలో జరిగిన ఓ సున్నితమైన వాస్తవ ఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు తెలుస్తోంది.

**బస్తర్ అడవుల్లో షూటింగ్**

సినిమా చిత్రీకరణలో ఎక్కువ భాగాన్ని నవంబర్, డిసెంబర్ నెలల్లో బస్తర్‌లోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో చిత్రబృందం అధికారికంగా ప్రకటించనుంది.

ఒకప్పుడు తుపాకులు పట్టిన చేతులు.. ఇప్పుడు నటనతో తమ అనుభవాలను తెరపై ఆవిష్కరించేందుకు సిద్ధమవుతుండటం ఆసక్తికర పరిణామంగా మారింది.

# సీజేపీ–కాంగ్రెస్ మధ్య ముదిరిన మాటల యుద్ధం

- అభిజిత్ దీప్కేను లక్ష్యంగా చేసుకుని ప్రచారం చేస్తున్నారన్న రాంకా, దాస్
- 'సెల్ఫ్ డిక్లేర్డ్ లిబరల్స్'పై సీజేపీ నేతల తీవ్ర వ్యాఖ్యలు
- బీజేపీ కంటే సొంత ఎకోసిస్టమ్ మరింత తీవ్రంగా వ్యవహరిస్తోందని విమర్శ
- 'రాజ్యాంగానికి సెల్ఫ్ డిక్లేర్డ్ థేకేదార్లు' అంటూ సౌరవ్ దాస్ సెటైర్
- సీజేపీపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి రీతమ్ సింగ్ కౌంటర్
- అరెస్టుల సమయంలో సాయం చేసినా కనీస మర్యాద చూపలేదని వ్యాఖ్య

**ముంబై, అక్టోబర్ 3:**

ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసనల అనంతరం ఆ పార్టీకి, కాంగ్రెస్‌కు మధ్య మాటల యుద్ధం మొదలైంది. సీజేపీ నేతలు అభిజిత్ దీప్కేను లక్ష్యంగా చేసుకుని ఓ వర్గం ప్రచారం చేస్తోందంటూ 'లిబరల్ ఎకోసిస్టమ్'పై తీవ్ర విమర్శలు చేశారు. సీజేపీ కో కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు.

రాంకా ఎక్స్‌లో చేసిన పోస్టులో 'సెల్ఫ్ డిక్లేర్డ్ లిబరల్ ఎకోసిస్టమ్' అభిజిత్ దీప్కేను విమర్శించేందుకు మళ్లీ యాక్టివ్ అయిందని ఆరోపించారు. చాలా కాలం తర్వాత లక్షలాది భారతీయుల ఊహలను దీప్కే ఆకర్షిస్తుండటాన్ని కొందరు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఎక్స్ వేదికకే పరిమితమైన ఆ వర్గం తమనే ప్రజాస్వామ్యానికి ఏకైక రక్షకులుగా భావిస్తోందని విమర్శించారు.

**'రాజ్యాంగానికి థేకేదార్లు'**

రాంకా వ్యాఖ్యలకు సౌరవ్ దాస్ మద్దతు తెలిపారు. బీజేపీకి చెందిన వారు కాకపోయినా కొందరు తామే 'భారత్, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత' తీసుకున్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వారిని 'సెల్ఫ్ డిక్లేర్డ్ లిబరల్స్', 'రాజ్యాంగానికి సెల్ఫ్ డిక్లేర్డ్ థేకేదార్లు'గా అభివర్ణించారు. ఈ ఎకోసిస్టమ్ బీజేపీ ఎకోసిస్టమ్ కంటే కూడా తీవ్రంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 'డివైడ్ అండ్ రూల్' తరహా రాజకీయాలతో ప్రజలను విభజించలేరని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ కౌంటర్**

రాంకా, దాస్ తమ పోస్టుల్లో ఏ పార్టీ పేరును నేరుగా ప్రస్తావించకపోయినా, వారి వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను ఉద్దేశించినవేనన్న చర్చ మొదలైంది. దీంతో కాంగ్రెస్ నుంచి కూడా స్పందన వచ్చింది. అస్సాం కాంగ్రెస్ అధికార ప్రతినిధి రీతమ్ సింగ్ మాట్లాడుతూ.. అస్సాంలో సీజేపీ సభ్యులను, అశుతోష్ రాంకాను పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు సహాయం చేశారని తెలిపారు. అయినప్పటికీ కనీస మర్యాదగా సీజేపీ నేతలు కాంగ్రెస్ నాయకులను కలవలేదని విమర్శించారు.

సీజేపీని అరవింద్ కేజ్రీవాల్‌ను తిరిగి రాజకీయంగా ముందుకు తీసుకొచ్చే వేదికగా మార్చొద్దని రీతమ్ సింగ్ సూచించారు. దీంతో ముంబై నిరసనల నేపథ్యంలో మొదలైన వివాదం సీజేపీ-కాంగ్రెస్ మధ్య బహిరంగ విమర్శలు, ప్రతివిమర్శలకు దారితీసింది.

# మైనర్ల వినియోగంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

- సీజేపీ శివాజీ పార్క్ నిరసనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటో విచారణ
- మైనర్లను 'రక్షణ కవచాలుగా' ఉపయోగించారన్న ఆరోపణలపై దర్యాప్తు
- ముంబై పోలీస్, ఎక్స్, కేంద్ర, మహారాష్ట్ర శాఖలకు నోటీసులు
- ఫొటోలు, వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు, డిజిటల్ ఆధారాల పరిశీలనకు ఆదేశం

**ముంబై, అక్టోబర్ 3:**

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 2న ముంబైలోని శివాజీ పార్క్‌లో నిర్వహించిన నిరసనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా స్పందించింది. ఆందోళనలో మైనర్లను ఉపయోగించారంటూ వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన కమిషన్.. నిరసనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన అంశాన్ని కూడా పరిశీలిస్తోంది.

**'రక్షణ కవచాలుగా' ఉపయోగించారా?**

సేవా న్యాయ ఉత్థాన్ ఫౌండేషన్ ప్రతినిధి సతీష్ వైద్ చేసిన ఫిర్యాదులో.. నిరసనకు సంబంధించిన కొన్ని వీడియోలు, ఫొటోల్లో చిన్నారులు కనిపించారని, కొందరు నినాదాలు చేస్తున్నట్లు ఉందని పేర్కొన్నారు. మైనర్లను నిరసనలో భాగం చేయడంపై ముందుగానే గ్రూపులు, చాట్‌లలో చర్చలు జరిగాయని ఫిర్యాదులో ఆరోపించారు. పోలీసుల చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు చిన్నారులను 'రక్షణ కవచాలుగా' ఉపయోగించాలనే ఉద్దేశం ఉందా అనే కోణంలోనూ విచారణ జరపాలని కోరారు. అయితే ఇవి ఫిర్యాదులోని ఆరోపణలేనని, వాటి వాస్తవాలను దర్యాప్తులో తేల్చాల్సి ఉంది.

**నలుగురికి నోటీసులు**

ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యుడు ప్రియాంక్ కనూంగో నేతృత్వంలోని ధర్మాసనం ముంబై పోలీస్ కమిషనర్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఎక్స్ కార్ప్ గ్రీవెన్స్ ఆఫీసర్, మహారాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు నోటీసులు జారీ చేసింది. నిరసనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను పరిశీలించాలని ముంబై పోలీసులను ఆదేశించింది. దర్యాప్తులో కాగ్నిజబుల్ నేరం బయటపడితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించింది.

**జువైనల్ జస్టిస్ చట్టంపైనా దృష్టి**

మైనర్లను ముందుగానే ప్రణాళికలో భాగంగా నిరసనకు తీసుకువచ్చారా? చట్టపరమైన చర్యలను అడ్డుకునేందుకు వారి ఉనికిని ఉపయోగించారా? అనే అంశాలను పరిశీలించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ కోరింది. జువైనల్ జస్టిస్ చట్టంలోని సంబంధిత నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. అలాగే




పిల్లల గుర్తింపును, గోప్యతను కాపాడుతూ వారి ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో మరింతగా ప్రచారం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.

**వారం రోజుల్లో నివేదిక**

ముంబై పోలీసులు దర్యాప్తులో భాగంగా నిరసనకు సంబంధించిన డిజిటల్ ఆధారాలను భద్రపరచడంతో పాటు నిర్వాహకులు, సమన్వయకర్తలు, పిల్లల వెంట వచ్చిన పెద్దలు, తల్లిదండ్రులు లేదా సంరక్షకుల పాత్రలను పరిశీలించాలని కమిషన్ సూచించింది. సంబంధిత అధికారులు వారం రోజుల్లో యాక్షన్ టేకింగ్ రిపోర్ట్ (ఏటీఆర్) సమర్పించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది.

# ఫైటర్ స్క్వాడ్రన్ల కొరత.. ఏటా 40 జెట్లు అవసరం

- ప్రతి ఏడాది 36–40 కొత్త యుద్ధ విమానాలు అవసరమన్న ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్
- ప్రస్తుతం 29 ఫైటర్ స్క్వాడ్రన్లు.. అవసరం 42
- తేజస్ ఎంకే-1ఏ, ఎంకే-2, ఎంఆర్‌ఎఫ్‌ఏ, ఏఎంసీఏపై దృష్టి
- 114 రాఫెల్ జెట్ల ఒప్పందం ఈ ఆర్థిక సంవత్సరంలో ఖరారయ్యే అవకాశం
- రక్షణ ప్రాజెక్టుల్లో జాప్యంపై ఏపీ సింగ్ ఆందోళన
- ఏఐ, డ్రోన్లు, అంతరిక్ష సామర్థ్యాలపై వైమానికదళం ఫోకస్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 3:**

భారత వైమానిక దళంలో ఫైటర్ జెట్ స్క్వాడ్రన్ల సంఖ్య మరింత తగ్గకుండా ఉండాలంటే ప్రతి ఏడాది 36 నుంచి 40 కొత్త యుద్ధ విమానాలు అవసరమని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ తెలిపారు. ఇది సుమారు రెండు ఫైటర్ స్క్వాడ్రన్లకు సమానమని చెప్పారు. ప్రస్తుతం ఉన్న కొరతను పూడ్చడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అదనపు యుద్ధ విమానాలను చేర్చుకోవాల్సి ఉందన్నారు.

ఎయిర్‌ఫోర్స్ డేకు ముందు నిర్వహించిన వార్షిక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ రంగ ప్రాజెక్టుల్లో చోటుచేసుకుంటున్న జాప్యం వైమానికదళ కార్యాచరణ సామర్థ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. సాంకేతిక ప్రాజెక్టులు ఆలస్యం కావడం అంటే అందుబాటులోకి రావాల్సిన టెక్నాలజీని ఆలస్యం చేయడమేనని పేర్కొన్నారు. అభివృద్ధి, ఉత్పత్తి ప్రక్రియలు ఎక్కువ కాలం కొనసాగితే అప్పటికే ప్రత్యర్థులు ఆ సాంకేతికతను అధిగమించే అవకాశం ఉంటుందని వివరించారు.

యుద్ధ విమానాల కొరతను అధిగమించేందుకు తేజస్ ఎంకే1ఏ, తేజస్ ఎంకే2, 114 విమానాల ఎంఆర్‌ఎఫ్‌ఏ ప్రాజెక్ట్, అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) కార్యక్రమాలు కీలకమని ఏపీ సింగ్ తెలిపారు. ఏఎంసీఏతో పాటు ఇతర ప్రాజెక్టుల్లో జాప్యం జరిగితే ప్రత్యామ్నాయ యుద్ధ విమానాల కొనుగోలును పరిశీలించాల్సి వస్తుందని అన్నారు.



**114 రాఫెల్ జెట్లపై చర్చలు**

114 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఖరారయ్యే అవకాశం ఉందని ఏపీ సింగ్ చెప్పారు. ధరతో పాటు ఇతర కీలక అంశాలపై చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. రష్యా తయారీ ఐదో తరం సుఖోయ్ 57పై మాత్రం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

**చైనా–పాక్ సహకారంపై ఆందోళన**

పాకిస్థాన్, చైనాల మధ్య ఐదో తరం యుద్ధ విమానాల విషయంలో సహకారం భారత్‌కు ఆందోళన కలిగించే అంశమని ఎయిర్ చీఫ్ మార్షల్ పేర్కొన్నారు. అయితే పాకిస్థాన్ ఆ విమానాలను తన మొత్తం యుద్ధ వ్యవస్థతో సమర్థంగా అనుసంధానం చేసుకోకపోతే వాటి సామర్థ్యం పూర్తిస్థాయిలో ఉపయోగపడదని అన్నారు.

**థియేటర్ కమాండ్ల విషయంలో జాగ్రత్త**

థియేటర్ కమాండ్ల ఏర్పాటుకు వైమానికదళం వ్యతిరేకం కాదని ఏపీ సింగ్ స్పష్టం చేశారు. అయితే వాటిని ఎలా, ఏ క్రమంలో అమలు చేయాలన్న అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ఎదురైన అనుభవాల అనంతరం ఈ అంశంపై జరుగుతున్న చర్చల్లో మార్పు వచ్చిందని తెలిపారు.

**ఆధునీకరణలో ఏఐ, డ్రోన్లకు ప్రాధాన్యం**

వైమానికదళ ఆధునీకరణలో కృత్రిమ మేధ, డ్రోన్లు, లాయిటరింగ్ మ్యూనిషన్స్, అంతరిక్ష సామర్థ్యాలు కీలకంగా మారుతున్నాయని ఏపీ సింగ్ చెప్పారు. ప్రత్యేక డ్రోన్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం కంటే ప్రస్తుతం ఉన్న యుద్ధ వ్యవస్థల్లోనే డ్రోన్లను సమర్థంగా సమన్వయం చేయడం అవసరమని ఐఏఎఫ్ భావిస్తోందన్నారు. ప్రస్తుతం భారత వైమానికదళం ఫైటర్ స్క్వాడ్రన్ల కొరతను ఎదుర్కొంటోంది. దేశానికి 42 ఫైటర్ స్క్వాడ్రన్లు అవసరం కాగా, ప్రస్తుతం 29 స్క్వాడ్రన్లు మాత్రమే ఉన్నాయి. సాధారణంగా ఒక్క స్క్వాడ్రన్‌లో 18 యుద్ధ విమానాలు ఉంటాయి.

# నిధుల లెక్కలు గ్రామసభలో వెల్లడించాలి



- లెక్కలు చెప్పకపోతే తదుపరి కార్యాచరణ చేపడతాం: బీజేపీ మండల అధ్యక్షుడు
- ఘనపూర్ హరీష్

**కొల్చారం, అక్టోబర్ 03 (సిరి న్యూస్)**

గ్రామ పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి లెక్కలను రాబోయే గ్రామసభలో ప్రజల ముందు వెల్లడించాలని బీజేపీ కొల్చారం మండల అధ్యక్షుడు ఘనపూర్ హరీష్ డిమాండ్ చేశారు. కొల్చారం మండలంలోని నాయిని జలాల్పూర్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసు నరసింహులు సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామ పంచాయతీ నిధుల వినియోగంపై వివరాలు కోరిన నేపథ్యంలో ఆయనకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఘనపూర్ హరీష్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు, వాటి ద్వారా చేపట్టిన పనులు, ఖర్చుల వివరాలను గ్రామసభలో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. నిధుల వినియోగంపై లెక్కలు వెల్లడించకపోతే తదుపరి కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసు నరసింహులను కించపరిచినంత మాత్రాన ఆయన విలువ ఏమాత్రం తగ్గదని హరీష్ అన్నారు. ఆయనకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు భూమాగౌడ్, గొల్ల కొమురయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ శేఖర్ యాదవ్, సాదుల స్వప్న ఉషయ్య, యువమోర్చా నాయకులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ ఘటనకు స్పందించిన అధికారులు..

సిరి ఎఫెక్ట్..సిరి ఎఫెక్ట్ | సిరి ఎఫెక్ట్ | సిరి ఎఫెక్ట్..సిరి ఎఫెక్ట్



- ఆపరేటర్ ముత్యం గారి శ్రీశైలం, అసిస్టెంట్ లైన్ మెన్ దేవ సోతు బాల్య లకు మెమొలు జారీ

**కొల్చారం, అక్టోబర్ 03( సిరి న్యూస్:)**

సిరి వార్తకు స్పందించిన అధికారులు కొల్చారం మండలం చిన్న ఘనాపూర్ సబ్‌స్టేషన్‌లో మూడు రోజుల క్రితం ఆపరేటర్ నిర్లక్ష్యం కారణంగా రైతులు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాపాయ స్థితికి చేరిన ఘటనపై అధికారులు స్పందించారు. ఘటనపై విచారణ చేపట్టి సంబంధిత ఆపరేటర్ ముత్యం గారి శ్రీశైలం, అసిస్టెంట్ లైన్‌మెన్ దేవసోత్ బాల్య లకు మెమోలు జారీ చేసినట్లు ఏఈ అహ్మద్ అలీ తెలిపారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# అమూల్ పరిశ్రమకు నేడు భూమిపూజ అమిత్ షా టూర్ రద్దు



**తూప్రాన్, అక్టోబర్ 03 సిరి న్యూస్**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు నేపథ్యంలో తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 10 వ వార్డు వెంకటాపూర్ లో నిర్మించనున్న అమూల్ మిల్క్ ప్రొడక్ట్స్ యూనిట్ భూమిపూజ కార్యక్రమంలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. సుమారు రూ. కోట్ల వ్యయంతో నిర్మించనున్న అమూల్ మిల్క్ యూనిట్ దేశంలో మూడోది అని ఈ అమూల్ పాల ఉత్పత్తుల యూనిట్ కు ఆదివారం భూమిపూజ నిర్వహించనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాక రద్దు కావడంతో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి ఈటల రాజేందర్ రఘునందన్ రావు లతో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి లు కలిసి భూమిపూజ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిశ్రమ ఏర్పాటుతో తూప్రాన్ ప్రాంత రైతులకు పాడి రైతులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయని తూప్రాన్ పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమితాషా టూర్ రద్దు కావడం తో అక్కడికి వచ్చిన భద్రత బలగాలు తిరుగు ప్రయాణం అయ్యారు ఆయన కోసం ప్రత్యేక హెలిప్యాడ్ ఏర్పాటు ట్రయల్ రన్ కూడా నిర్వహించారు బిజెపి నాయకులు రైతులతో 5000 మందికి సమావేశం కోసం వాటర్ ప్రూఫ్ షెడ్ కూర్చోవడానికి కుర్చీలు వేదిక పూర్తయ్యే సమయానికి అమితాషా టూర్ రద్దు కావడం అమూల్ యాజమాన్యం అసంతృప్తి గా ఉన్నారు

# వందేళ్లు బతికే సీక్రెట్ ఈ దేశస్తులకే తెలుసు..!



మనిషి ఆయువు వందేళ్లంటారు. ఒకప్పుడు మన పూర్వీకులు ఆయుష్షులో 'సెంచురీ'లు కొట్టేసేవారని మన పెద్దలు అప్పుడప్పుడు చెబుతూ ఉంటారు. కానీ, ప్రస్తుతం ఉన్న జీవన విధానంలో మార్పుల కారణంగా సరాసరి ఆయుష్షు 70 ఏళ్లు మించడం లేదు. లైఫ్‌స్టైల్, రోగాలు, దురాలవాట్లతో చాలా మంది చిన్న వయస్సులోనే జీవితాన్ని ముగిస్తున్నారు. హార్ట్ స్ట్రోక్ మరణాలు ఎక్కువవుతున్నాయి. ఉన్నట్టుండే మనుషులు కుప్పకూలుతున్నారు. ఎవరు ఎప్పుడు ఎక్కడ ఎలా పోతారో ఎవరికీ అర్థం కావడం లేదు. వీటన్నిటి నడుమ ప్రశాంతంగా ఓ అరవై ఏళ్లు బ్రతకడం కూడా కష్టమవుతోంది. మరి ఎక్కడైనా 80 ఏళ్లకు పైనే జీవించే వారు ఉన్నారా..? అంటే అందరూ ఈ దేశాలవైపే చూస్తున్నారు. మరి ఆ దేశాలు ఏమిటో తెలుసుకుందాం.



ముందుగా దక్షిణ కొరియానే చెప్పుకోవాలి. ఎందుకంటే ఇక్కడ సగటు ఆయుర్ధాయం 90పైమాటే అంటా. ప్రపంచంలో 90ఏళ్లు సగటు ఉన్న తొలి దేశంగా దక్షిణ కొరియా రికార్డు సృష్టించింది. ఈ దేశం బలమైన ఆర్థిక వ్యవస్థను కలిగి ఆదర్శంగా నిలుస్తోంది. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే ఇక్కడి ప్రజలకు తక్కువ రక్త పోటు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు ఉన్నాయి. కొరియన్లు ఎక్కువగా పులియబెట్టిన ఆహారాన్ని డైట్ గా తీసుకుంటారు. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, క్యాన్సర్ ను నివారిస్తూ రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. వీరు బౌద్ధ మతాన్ని ఆచరిస్తారు. దీనివల్ల వీరు ఒత్తిడి ఆందోళన దూరంగా ఉంటారు.

## స్పెయిన్

**స్పెయిన్ లో సగటు ఆయుర్ధాయం 82.8 సంవత్సరాలు. స్పెయిన్ కూడా జపాన్ మాదిరిగానే ఉంటుంది. స్పానిష్ ప్రజల అధిక ఆయుర్ధాయానికి కారణం వారి మెడిటేరియన్ డైట్. ఆలివ్ ఆయిల్ - కూరగాయలు - వైన్ వంటివి గుండెకు మేలు చేకూరుస్తాయి. అరగంట భోజన విరామానికి బదులుగా 2నుంచి 3గంటల విరామం తీసుకుంటారు. వీరంతా వాహనాలను వినియోగించడం కంటే నడకకే ప్రాధాన్యమిస్తారు.**



## జపాన్

జపానీయులు ఎక్కువ కాలం జీవిస్తారనే చాలా మందికి తెలుసు. వీరి సగటు ఆయుర్ధాయం 83సంవత్సరాలు. జపాన్ ను అమర వీరుల భూమిగా పిలుస్తారు. జపాన్ ప్రజలు అత్యున్నత నాణ్యమైన జీవనాన్ని కలిగి ఉంటారు. వీరు తీపి బంగాళదుంపలు, చేపలు, రిచ్ డైట్ తీసుకుంటారు. జపాన్లో ప్రాచీనం నాటి సంస్కృతులు పాటిస్తూ ప్రాచీన ఆహారాన్ని తీసుకుంటుండడం వారి ఆయుర్ధాయం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.



## స్విట్జర్లాండ్

స్విట్జర్లాండ్ లో ప్రజల సగటు ఆయుర్ధాయం 81 సంవత్సరాలు. స్విట్జర్లాండ్ ఐరోపాలోని సంపన్న దేశాలలో ఒకటి. ఆరోగ్య సంరక్షణ బలమైన వ్యక్తిగత భద్రత ప్రజా శ్రేయస్సు వంటివి ప్రజలు ఎక్కువ కాలం జీవించేందుకు దోహదపడుతున్నాయి. చీజ్, డైరీ ఉత్పత్తులను తీసుకుంటారు. స్విట్జర్లాండ్ వృత్తి ఆధారిత దేశం. ఇక్కడి ప్రజలు వీకెండ్స్ లో ప్రయాణాలను ఎంజాయ్ చేస్తూ గడుపుతుంటారు.





# శ్వాస తీసుకోకుండా బతికే జీవి ఇదే!

ప్రపంచంలో చాలా వింత జీవులు ఉన్నాయి. ఇవి వాటి ప్రత్యేకతలకు ప్రపంచమంతటా ప్రసిద్ధి చెందాయి. భూమ్మీద బతకడానికి ప్రతి జంతువు ఆక్సిజన్ పీల్చుకోవాల్సిందేనని చిన్నప్పటి నుంచి చదువుకుంటూనే ఉన్నాం. అది నీటిలో కరిగిన ఆక్సిజన్ అయినా కావొచ్చు, లేదా గాలిలో వాయువు రూపంలోనైనా కావొచ్చు. కానీ కొత్తగా ఆక్సిజన్ పీల్చుకోకుండా బతుకుతున్న ఓ చిన్న జంతువును ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ యూనివర్సిటీ పరిశోధకులు కనిపెట్టారు.



**ప్రపంచంలో చాలా వింత జీవులు ఉన్నాయి. ఇవి వాటి ప్రత్యేకతలకు ప్రపంచమంతటా ప్రసిద్ధి చెందాయి. భూమ్మీద బతకడానికి ప్రతి జంతువు ఆక్సిజన్ పీల్చుకోవాల్సిందేనని చిన్నప్పటి నుంచి చదువుకుంటూనే ఉన్నాం. అది నీటిలో కరిగిన ఆక్సిజన్ అయినా కావొచ్చు, లేదా గాలిలో వాయువు రూపంలోనైనా కావొచ్చు. కానీ కొత్తగా ఆక్సిజన్ పీల్చుకోకుండా బతుకుతున్న ఓ చిన్న జంతువును ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ యూనివర్సిటీ పరిశోధకులు కనిపెట్టారు.**

హెన్నెగువా సాల్మినికోలా అని పిలిచే ఈ జీవి శరీరం కేవలం పది కణాలతో నిర్మితమై ఉంటుంది. ఇది ఆక్సిజన్ లేకుండా జీవించగలదు. ప్రపంచంలో ఇదే దీని ప్రత్యేక లక్షణం. ఉన్న ప్రపంచంలో ఇలా జీవించే మొదటి జీవి. జెల్లీ ఫిష్ లాగా కనిపించే ఈ బహుళ సెల్యులార్ పరాన్నజీవికి మైటోకాన్డ్రియల్ జన్యువు లేదు. శాస్త్రవేత్తల చెప్పినదాని ప్రకారం ఈ జీవి తన చుట్టూ ఉండే చేపల నుండి శక్తిని పొందుతుంది. కానీ ఈ సమయంలో అది వారికి ఏ విధంగానూ హాని కలిగించదు. మరో ప్రత్యేక విషయం ఏమిటంటే చేపలు కూడా ఈ పరాన్నజీవికి హాని కలిగించవు. ఈ పరాన్నజీవులు సాల్మన్ చేపల గుంపులో కనిపిస్తాయి. తన చుట్టూ చేపలు సజీవంగా ఉన్నంత కాలం అవి జీవిస్తూ ఉంటాయి.



**పరిశోధన సమయంలో శాస్త్రవేత్తలు మైక్రోస్కోప్ తో ఈ జీవిని గమనించినప్పుడు, వారికి అందులో మైటోకాన్డ్రియల్ డీఎన్ఏ కనిపించలేదు. దీని తర్వాత ఇది ప్రపంచంలోనే మొదటి జీవి అని స్పష్టమైంది. ఈ జీవి మానవులకు లేదా ఇతర జీవులకు అస్సలు హాని కలిగించదు. అయినప్పటికీ, ఆక్సిజన్ లేకుండా జీవించగలిగే అటువంటి జీవి భూమిపై ఎలా ఉద్భవించిందో ఇప్పటికీ మిస్టరీగానే ఉంది. ఈ పరాన్నజీవి మరొక లక్షణం ఏమిటంటే ఇది స్వచ్ఛమైన నీటితోపాటు ఉప్పు నీటిలో కూడా జీవించగలదు. అందుకే దీనిని మైక్సోజోవాన్ అంటారు.**

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.